


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 18.10.2025 | సంపుటి : 2 | సంచిక :254 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI Saturay 18.10.2025 volume : 2 Issue : 254 Pages : 8 Cost : 2/-



'లండన్‌లో మీ అబ్బాయికి ప్రమాదం..'

రూ.35 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

06



ఏకకాలంలో భారత్, అఫ్గాన్‌తో యుద్ధానికి సిద్ధం : పాక్ మంత్రి బీరాలు

06



04

# లొంగిపోయిన మావో అగ్రనేత ఆశన్న

## ఆశన్న సహా 208మంది మావోల లొంగుబాటు

### భారీగా ఆయుధాలు అప్పగింత

### వారి పునరావాసానికి ఏర్పాట్లు చేస్తామన్న ఛత్తీస్‌ఘడ్ సిఎం

**రాయపూర్, అక్టోబర్ 17 :** మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్ల పల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ పోలీసుల ముందు లొంగి పోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు. వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 153 ఆయుధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే-47 రైఫిళ్లు, 17 ఎస్‌ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి.

# ఆధునిక పద్ధతులతో పత్తి దిగుబడి పెంచాలి

## సీసీఐ ద్వారా క్వింటాల్ పత్తి రూ.8,110కు కొనుగోలు

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

కేంద్ర ప్రభుత్వం పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. క్వింటాల్ పత్తి రూ.8,110 ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో పత్తి సాగు ఉత్పత్తి పెరుగుతోందని.. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ముందు ఉందన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా సాగవుతున్న పంట పత్తి అని.. రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని తెలిపారు. 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు.



**హైదరాబాద్,అక్టోబర్17 :** గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. పత్తి రైతులు దళారుల చేతిలో పడి మోస పోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. కొనుగోలు కేంద్రాలను మరో 12పెంచామని.. మొత్తం 122 కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు కేంద్రమంత్రి. పత్తి సాగు ఉత్పత్తిలో సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. తొమ్మిది ప్రాంతీయ భాషల్లో పత్తి సాగుకు సంబంధించి కిసాన్ యాప్‌ను తీసుకొచ్చామని.. యాప్‌లో రైతులు నమోదు చేసుకుంటే.. స్లాట్ ద్వారా పత్తిని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని అన్నారు.

-మిగతా 3 లో..



తెలంగాణ స్థానిక ఎన్నికల నిర్వహణపై కీలక పరిణామాలు చూటుచేసుకుంటున్నాయి. తాజాగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై రీనోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్ లో దాఖలు చేశారు.

# స్థానిక ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

## ప్రభుత్వం, ఈసీని ప్రశ్నించిన హైకోర్టు

### గడువు కోరడంతో విచారణ రెండు వారాలకు వాయిదా

**హైదరాబాద్,అక్టోబర్17 :** సుప్రీంకోర్టు ఈసీ నోటిఫికేషన్ ను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ న్యాయవాది సురేందర్ పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. వాదనలు విన్న హైకోర్టు.. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ను ప్రశ్నించింది. ఎన్నికలు నిర్వహణపై సమాధానం చెప్పేందుకు రెండు వారాల సమయం

-మిగతా 2 లో..




06

### గ్రీన్ కార్డ్ లాటరీలోనూ భారత్‌పై ఆంక్షలు

తక్కువ వలసలు ఉన్న దేశాలకు ప్రాధాన్యం

2028 వరకు యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీకి దూరం

భారతీయులు లక్ష్యంగా అమెరికా మరో నిర్ణయం



### భారత్, చైనా వంటి దేశాల నుంచి నాసిరకం ఔషధాలు

అమెరికా సెనెటర్ ఆరోపణలు

06

# బిసి బిల్లును అడ్డుకున్న పాపం బిజెపిదే

## బిల్లును అడ్డుకోవడంవల్లనే బిసి బంద్

బంద్‌కు పూర్తి బాధ్యత బిజెపిదే

దమ్ముంటే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

బిజెపిని డిమాండ్ చేసిన డిప్యూటీ సిఎం భట్టి

02



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు దేశంలో ఎక్కడా లేని విధంగా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలిసారిగా సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన నిర్వహించామని.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూసినట్లు తెలిపారు.

# బంద్ ఫర్ జస్టిస్.. నేడు రాష్ట్ర బంద్

## బిసి సంఘాలకు అన్ని పార్టీల మద్దతు

### బిజెపి లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు

హైదరాబాద్,అక్టోబరు17 : బంద్ ఫర్ జస్టిస్ పేరుతో 18వ తేదీన బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఆందోళన నిర్వహించ నున్నాయి. ఈ క్రమంలో బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోంది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, లెఫ్ పార్టీలు కూడా బంద్‌ఉ మద్దతు ఇచ్చాయి. బంద్‌ను విజయవంతం చేయడం ద్వారా ఆవేదనను తెలియచేయాలని ఆర్ .కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన

- మిగతా 2వ పేజీలో..



# రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా గన్ కల్చర్

పూర్తిగా తగ్గిపోయిన పెట్టుబడులు

రాష్ట్రానికి రావాలంటేనే భయపడుతున్న పరిశ్రమలు

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



రేవంత్ రెడ్డి హయాంలో పెట్టుబడులు తగ్గడంతో పాటు, తెలంగాణకు గన్ కల్చర్ వచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. నివేదికల ప్రకారం తమ హయాంలో కన్నా పెట్టుబడులు పూర్తిగా తగ్గిపోయాయని అన్నారు. బెదరింపులు, వసూళ్లే ఇందుకు కారణమని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డిపై కేబినెట్ మంత్రి కుటుంబ సభ్యులే ఆరోపణలు చేశారని గుర్తుచేశారు.

02

# ఆస్తులు అమ్ముకుని కాంగ్రెస్‌ను కాపాడా

- అయినా తనను పక్కన పెడుతున్న పార్టీ
- మరోమారు అక్కసు వెళ్లగక్కిన రాజగోపాల్



నల్లగొండ, అక్టోబర్ 17 : మంత్రి పదవి దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంతపార్టీపై మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌ను కాపాడేందుకు తన ఆస్తులు అమ్ముకున్నా నని, కానీ పార్టీ తనను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన నలుగురికి మంత్రి పదవులు ఇచ్చారని, తనతోపాటు బీజేపీ నుంచి వచ్చిన వివేక్ వెంకటస్వా మికి మంత్రి పదవి, అతని కుమారుడికి ఎంపీ టికెట్ ఇచ్చార న్నారు. తనను మాత్రం పక్కన పెట్టారని మండిపడ్డారు. పార్టీ కోసం ఆస్తులు అమ్ముకుని కష్టపడిన నన్ను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చి తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- మిగతా 4వ పేజీలో..

# నేడు రాష్ట్రం బంద్

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే అన్ని పార్టీలను నేరుగా కలిసి కోరారు. బిసి బంద్‌కు అందరి మద్దతు ఉందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ బిల్లును అడ్డుకునే వాళ్లు కూడా ఈ బంద్‌లో పాల్గొంటున్నారని చెప్పుకొచ్చారు. శుక్రవారం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తాను కూడా బంద్‌లో పాల్గొంటానని ఉద్ఘాటించారు. ఈ బంద్‌లో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అని ఉద్ఘాటించారు. తాము అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి ఈ బంద్‌లో పాల్గొంటున్నామని వివరించారు. బీజేపీ నేతలు ఎన్ని మాటలు చెప్పినా బీసీల హృదయాల్లో చోటు సంపాదించుకోలేరని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఈ బంద్‌లో పాల్గొనాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందని ఆ పార్టీ భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రేపటి బీసీ బంద్‌ని జయప్రదం చేయాలని సూచించారు. రేపటి బీసీ బంద్‌కి అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందని ఉద్ఘాటించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశంలో జనగణనలో భాగంగా కులగణన జరగాలని కోరారని పేర్కొన్నారు. కాంగ్రెస్ డెడికేషన్ కమిషన్ పెట్టి శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేసిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ వేశామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలని ఆర్. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ కలిసి బీసీ బంద్‌కి మద్దతు కోరారని గుర్తుచేశారు. ఆర్. కృష్ణయ్యపై గురుత్వర బాధ్యత ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్. కృష్ణయ్య తెలంగాణలో చేసే ప్రయత్నం ఢిల్లీలో కూడా చేయాలని కోరారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లని ఆర్. కృష్ణయ్య ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించాలని సూచించారు. తాము కూడా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. వారితో కలిసి ఢిల్లీకి వచ్చి ప్రధాని మోదీని, రాష్ట్రపతిని కలుస్తామని తెలిపారు. కాంగ్రెస్ బీసీ కులగణన చేసి, 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఉద్ఘాటించారు. బీసీలకు న్యాయం చేసి బీజేపీ క్రెడిట్ తీసుకున్న తమకు నష్టం లేదని చెప్పుకొచ్చారు. కేబినెట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లుకి ఆమోదం తెలిపి గవర్నర్‌కి పంపించామని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ అంశంపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ చర్చిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వాతంత్రం ఉంటుందని ఉద్ఘాటించారు. అప్పుడప్పుడూ సమస్యలు వస్తాయని.. అవి సద్దుమనుగుతాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌లో నియంత పాలన ఉండదని.. సమస్యలన్నీ సద్దుమనుగుతాయని తెలిపారు. ఇవన్నీ చిన్న చిన్న సమస్యలేనని, టీ కప్పులో తుఫాన్ లాంటివేనని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలపై నేడు నోటిఫికేషన్

**హైదరాబాద్:** రాష్ట్రంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలపై శనివారం నోటిఫికేషన్ జారీ కానుంది. సీసీఐ ఎంపిక చేసిన కేంద్రాల జాబితా మార్కెటింగ్ శాఖకు అందిన వెంటనే జిల్లాల వారీగా కలెక్టర్లు నోటిఫికేషన్ ఇస్తారు. దానికి అనుగుణంగా ఆయా కేంద్రాల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తారు. రాష్ట్రంలో 2025-26 సీజన్‌లో 341 కేంద్రాల్లో పత్తి క్రయవిక్రయాలు జరగనున్నాయి. ఇందులో 328 జిన్నింగ్ మిల్లుల్లో ఉండగా మిగిలినవి మార్కెట్ యార్డుల్లోనివి. శుక్రవారం వరకు 122 కేంద్రాలకు సంబంధించి జాబ్‌వర్క్ కోసం సీసీఐ ఒప్పందాలు చేసుకుంది. మిగిలిన కేంద్రాలతో ఒప్పందాలు పూర్తి చేసి శనివారం ఆ జాబితాను మార్కెటింగ్‌శాఖకు పంపించేందుకు సన్నాహాలు చేస్తోంది.



## ఉచిత చేపపిల్లల పంపిణీ ప్రారంభం

**నారాయణపేట జిల్లాలో పాల్గొన్న మంత్రులు శ్రీహరి, రాజనర్సింహ**

**మక్తల్:** రాష్ట్రంలో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని పెద్దచెరువు, సంగంబండ రిజర్వాయర్‌లో మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహలు చేపపిల్లలను వదిలారు. మిగిలిన జిల్లాల్లో సోమవారం నుంచి ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. రూ.122 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 46 వేల చెరువులు, కుంటల్లో 98 కోట్ల చేప,రొయ్య పిల్లల పంపిణీకి మత్స్యశాఖ ఏర్పాట్లు చేసింది. దీనిపై మంత్రులు, ఎమ్మెల్యేలకు సమాచారం ఇచ్చి వారి సూచించిన తేదీల మేరకు సోమవారం జిల్లాలవారీగా షెడ్యూలును విడుదల చేయనున్నారు.

## కొత్త వ్యవసాయ కళాశాలల్లో 30 చొప్పున సీట్లు

**త్వరలో ప్రవేశాలకు కౌన్సెలింగ్**

**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్, హుజూర్‌నగర్, డిచ్‌పల్లిలలో కొత్తగా వ్యవసాయ కళాశాలలు ప్రారంభించనున్న విషయం విదితమే. భవనాల లభ్యత, విద్యార్థుల వసతిగృహాల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని 30సీట్ల చొప్పున వాటిని ప్రారంభించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ణయం తీసుకుంది.. త్వరలోనే ఈ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనుంది. వచ్చే నెలలో మిగిలిన కళాశాలలతో పాటు తరగతులు నిర్వహించాలని భావిస్తోంది. 3 కళాశాలల కోసం 8 భవనాలను పరిశీలించారు. కొడంగల్ కళాశాల కోసం స్థానికంగా అద్దె భవనం లేదా తాండూరులోని పరిశోధనా కేంద్ర భవనం.. హుజూర్‌నగర్ కళాశాలకు అక్కడే ఉన్న అద్దె భవనం.. డిచ్‌పల్లి కళాశాలకు సమీపంలోని తెలంగాణ వర్సిటీ భవనం వంటి వాటిని పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సమావేశమైన అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈ ఏడాది ఈఏపీసెట్ ర్యాంకుల ఆధారంగా త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పించేందుకు ఏర్పాట్లుచేయాలని పాలకమండలి అధికారులను ఆదేశించింది. కొడంగల్ కళాశాలను మహబూబ్‌నగర్ జిల్లా పాలెం వ్యవసాయ కళాశాలకు, నిజామాబాద్ కళాశాలను రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలకు, హుజూర్‌నగర్ కళాశాలను అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు మెంటర్‌గా బాధ్యతలు అప్పగించారు.

# నర్సరీ నుంచి 4వ తరగతి వరకు కొత్త పాఠశాలలు

- వాటిలో పాలు, అల్పాహారం అందించేలా ప్రణాళికలు
- వచ్చే ఏడాదికి సిద్ధం చేయాలి: సీఎం



**హైదరాబాద్:** నర్సరీ నుంచి 4వ తరగతి వరకు మరింత నాణ్యమైన విద్యను అందించేలా నూతన పాఠశాలలను ప్రయోగాత్మకంగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వాటిల్లో కార్పొరేట్ స్థాయిలో అన్ని వసతులు ఉండాలని, చిన్నారులకు పాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. తన నివాసంలో ఆయన శుక్రవారం రాత్రి విద్యాశాఖపై సమీక్షించారు. ఈ కొత్త పాఠశాలలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేలా కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. సర్కారు బడుల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తొలిదశలో ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌పై దృష్టి సారించాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలని సూచించారు. ఆట స్థలం, అవసరమైన తరగతి గదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలని, అందుకు విద్యాశాఖ పరిధిలోని స్థలాలను గుర్తించాలన్నారు. సరైన సౌకర్యాలు లేని బడులను దగ్గరలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లోకి తరలించాలని ఆదేశించారు. సమావేశంలో సలహాదారులు కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

(మొదటిపేజీ తరువాయి)




ఇవ్వాలని న్యాయస్థానాన్ని ప్రభుత్వం, ఈసీ కోరింది. దీంతో హైకోర్టు ఇందుకు అంగీకరించి రెండు వరాల సమయం ఇచ్చింది. అనంతరం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచూ ప్రభుత్వం జారీచేసిన జీవోను హోకోర్టు కొట్టివేడంతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్ చేస్తూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఈ నెల 9 న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ జీవో ప్రకారమే ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే హైకోర్టు ఆ జీవోపై స్టే విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టకుండానే అత్యున్నత న్యాయస్థానం సైతం రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేయడంతో రిజర్వేషన్ల పంచాయితీ అగమ్యగోచరంగా మారింది. దీనితో స్థానిక ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అటు ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. గురువారం సుప్రీంకోర్టు కూడా ఎన్నికలకు వెళ్లమని చెప్పింది కదా అంటూ వ్యాఖ్యానించింది. ఎన్నికలు పెట్టుకోవచ్చని ఓరల్‌గా మాత్రమే చెప్పిందని.. ఆర్డర్‌లో ఎక్కడా చెప్పలేదని ఎలక్షన్ కమిషన్ తరపు న్యాయవాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాశామని కోర్టుకు తెలిపారు. బీసీ రిజర్వేషన్లలను 42 శాతానికి పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చాం కాబట్టే దాన్ని సస్పెండ్ చేశాం. మళ్లీ రిజర్వేషన్లను గూర్చి ప్రభుత్వంతో చర్చించాకే రీ నోటిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. రెండు వారాల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం కోర్టును కోరడంతో తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

# రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా గన్ కల్చర్




**హైదరాబాద్,అక్టోబర్17:** మంత్రి కుటుంబ సభ్యుల ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే తుపాకీ పంపించారని, తమ్ముళ్ల కోసం ఫైల్స్ ఆపుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కేబినెట్ దండుపాళ్యం ముఠా మాదిరిగా తయారైందని ఎద్దేవా చేశారు. శుక్రవారం)తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వ్యాపారవేత్తలకు తుపాకులు పెట్టే సంస్కృతిని రేవంత్ హయాంలో తీసుకొచ్చారని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి హయాంలో మాత్రం అవినీతి వాటాల కోసం కొట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పారిశ్రామికవేత్తలు, సినిమా ఇండస్ట్రీ, కాంట్రాక్టర్లను కాంగ్రెస్ నేతలు బెదిరించి లొంగదీసుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య అక్రమ సంబంధం ఉందని భావించాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి సన్నిహితులే తుపాకీ పెట్టి బెదిరించే పరిస్థితులు వచ్చాయని విమర్శించారు. రాష్ట్రంలో ఇంత జరుగు తుంటే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు నోరు మెదపటం లేదు..? అని నిలదీశారు. మంత్రుల పంచాయితీలు పరిష్కరించడానికే కేబినెట్ సమావేశాలు పెడుతున్నారని సెటైర్లు గుప్పించారు మాజీ మంత్రి హరీశ్‌రావు. కేబినెట్ భేటీలో మంత్రులు తిట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కేబినెట్ ఆరడజను వర్గాలుగా విడిపోయిందని దెప్పిపొడిచారు. రాష్ట్ర ప్రభుత్వం అతుకుల బొంతలాగా మారిందని స్వయానా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి హయాంలోని 23 నెలల్లో ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుతారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దు కోవాలన్న చందంగా.. కాంగ్రెస్ నేతలు అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నీళ్లు, నిధుల వాటాలు సాధించామని అన్నారు. హ్యామ్ మోడల్‌పై బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణ జరుపుతామని హెచ్చరించారు. హ్యామ్ మోడల్ బోగస్ అని.. కమిషన్లు దండుకోవటానికే ఈ మోడల్ తీసుకువస్తున్నారని ఆరోపించారు. దీపావళికైనా హామీలు అమలు చేస్తారని ఎదురుచూసిన ప్రజలకు మళ్లీ నిరాశే ఎదురైందని మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బిసి బిల్లును అడ్డుకున్న పాపం బిజెపిదే

**ఖమ్మం,అక్టోబర్17 :** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు దేశంలో ఎక్కడా లేని విధంగా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలిసారిగా సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన నిర్వహించామని.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూసినట్లు తెలిపారు. చట్ట సభల్లో ఏకగ్రీవాగంగా ప్రవేశ పెట్టామని.. గవర్నర్, రాష్ట్రపతికి పంపించినట్లు తెలిపారు. అయితే తాము పాస్ చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతోందని ఆరోపించారు. ఇది బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని భట్టి మండిపడ్డారు. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేశామని.. బీజేపీ పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు పాస్ చేయడమే కాకుండా న్యాయస్థానాలకు కూడా వెళ్తోందన్నారు. ఓబీసీపై సుప్రీం కోర్టులో ప్రముఖ న్యాయవాదులు పోరాడుతున్నారని తెలిపారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో పెట్టక పోవడం వల్లే... ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ కష్టమని సుప్రీం కోర్టు చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ పార్టీ వల్లనే బీసీ రిజర్వేషన్ల అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. దీని వల్ల రాష్ట్రంలో ఓబీసీ సంఘాలన్నీ కూడా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. రేపు జరిగే ఓబీసీ బంద్‌కు ప్రధాన కారణం బీజేపీ అని అన్నారు. ఓబీసీల బంద్‌లో అన్ని పార్టీల సంఘాలు ఆమోదం తెలిపాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఓబీసీ బిల్లుపై ఎందుకు మొండి వైఖరి చూపిస్తున్నారని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లను ప్రశ్నించారు. ప్రధానితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఓబీసీ బిల్లును ఎందుకు పాస్ చేయించడం లేదని నిలదీశారు. బిల్లులకు అడ్డుపడుతూ మళ్ళీ కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క బీసీలే కాదు అన్ని వర్గాల ప్రజలు కూడా.. బీజేపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ చేస్తున్న ఆగడాలను అందరూ గమనిస్తున్నారని.. కమలం పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ఈ బంద్ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా ఆయన సమయమివ్వలేదని చెప్పారు. ఈ అంశంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రధాని సమయం ఇస్తే.. అఖిలపక్షంతో కలిసి వచ్చేందుకు సీఎం రేవంత్ సిద్ధమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేందుకు భాజపా ఎందుకు అడ్డుపడుతోందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ భాజపా వైఖరికి వ్యతిరేకంగా జరుగుతోందన్నారు. దీనికి కాంగ్రెస్ శ్రేణులతో పాటు అందరూ మద్దతు తెలపాలని కోరారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు డిప్యూటీ సీఎం. సింగరేణి కార్మికులకు దీపావళికి 400 కోట్ల రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. సింగరేణి ఖమ్మం జిల్లా నుండే మొదలైందని.. ఇక్కడ మొదలై రాష్ట్రం అంతటా వ్యాపించిందన్నారు. సింగరేణి కార్మికులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



## సర్వే వ్యవస్థ బలోపేతానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు

- 19న సీఎం చేతులమీదుగా లైసెన్స్‌లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్:** రాష్ట్రంలో సర్వే వ్యవస్థ బలోపేతానికి లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం చేపడుతున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ వ్యవస్థ బలపడితేనే ప్రజల భూములకు భద్రత, న్యాయం లభిస్తుందని.. ప్రతి మండలానికి భూ విస్తీర్ణాన్ని బట్టి నాలుగు నుంచి ఆరుగురిని నియమించనున్నట్లు చెప్పారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతులు మీదుగా లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్సులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 'భూముల కొలతలు, రికార్డులు స్పష్టంగా ఉన్నప్పుడే వివాదాలు తగ్గుముఖం పడతాయి. గత పదేళ్లుగా సర్వే విభాగం నిర్లక్ష్యానికి గురైంది. క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు సరైన సేవలు అందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంలోనే రిజిస్ట్రేషన్ సమయంలో భూమి సర్వే పటం జత చేయడాన్ని తప్పనిసరి చేశాం. ఈ నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలమైంది. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతం ఉన్న 350 మంది సర్వేయర్లు సరిపోరు. అందుకే ఆ శాఖలో ఖాళీల భర్తీతోపాటు అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకాలను చేపట్టే చర్యలు ప్రారంభించాం. మొదటి విడతలో 3,465 మంది ఎంపికయ్యారు. వారికి శిక్షణ పూర్తయింది. రెండో విడతలో మరో 3 వేల మందికి శిక్షణ కొనసాగుతోంది' అని మంత్రి వివరించారు. సమీక్షలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

## ఆ రెండు పార్టీలు ఎంఐఎం నుంచే రాజకీయ పాఠాలు నేర్చుకుంటున్నాయి

**కేంద్ర మంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తుకుంటున్నట్లు పైకి కనిపించినా.. ఆ రెండు పార్టీలు ఎంఐఎం నుంచే రాజకీయ పాఠాలు నేర్చుకుంటున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భాజపా-ఎంఐఎం ఒక్కటేనని ఆరోపించారని, మరి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓవైసీ బహిరంగంగానే కాంగ్రెస్‌కు మద్దతు పలకడంపై ఆయన ఎలా స్పందిస్తారని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో విజయం భాజపాదేనని, ప్రజలు ఓటుతో మిగతా పార్టీలకు బుద్ధి చెబుతారని శుక్రవారం సంజయ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.



## నేటితో ముగియనున్న 'మద్యం' దరఖాస్తుల గడువు

**హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్త మద్యం విధానం(2025-27)లో దుకాణాలను దక్కించుకునేందుకు దరఖాస్తుల దాఖలు గడువు శనివారంతో ముగియనుంది. గత నెల 26న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముందునుంచే మందకొడిగా సాగింది. క్రితంసారి మద్యం విధానంలో రూ.2 లక్షలుగా ఉన్న రుసుం ఈసారి రూ.3 లక్షలకు పెంచడంతో వ్యాపారులు తొలుత అనాసక్తి ప్రదర్శించినట్లే కనిపించింది. అయితే గడువు ముగుస్తున్న తరుణంలో దరఖాస్తుల దాఖలు ప్రక్రియ ఊపందుకొంది. గురువారం నాటికి సుమారు 25 వేల దరఖాస్తులు దాఖలు కాగా.. శుక్రవారం ఒక్కరోజు మరో దాదాపు 25 వేలకుపైగా దరఖాస్తులొచ్చాయి. శనివారం గడువు ముగుస్తుండటంతో చివరిరోజు మరో 30వేల నుంచి 40వేల దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో అవార్డులు




### రాష్ట్రపతి ముర్మునుంచి అవార్డు అందున్న సెక్రటరీ గౌరవ్ ఉప్పల్

న్యూఢిల్లీ,అక్టోబర్17 : ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ రాష్ట్రం ఉత్తమ ప్రతిభ కనబర్చి.. అవార్డులు సాధించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సెక్రెటరీ కోఆర్డినేషన్ డా. గౌరవ్ ఉప్పల్ అవార్డులను స్వీకరించారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం ఆది కర్మయోగి జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్‌మన్, ఆది కర్మయోగి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు, గ్రామ స్థాయి అధికారులను రాష్ట్రపతి సత్కరించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి సన్మాన కార్యక్రమం జరిగింది. గిరిజన సాధికారత కార్యక్రమాలు ఖఓఎంఔఓంఔ, ఆది కర్మయోగి అభియాన్, జనభాగిరధి, ధర్తి ఆబా జన్ భగీదరి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మంత్రిత్వ శాఖలు, అధికారులకు భారత రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు. ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ ఉత్తమ పనితీరు కనబరిచింది. జాతీయ ర్యాంకింగ్‌లో 3వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా గిరిజన సమూహాలకు న్యాయం చేయడం, వారు నివసించే ప్రాంతాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేసి.. మూడో స్థానంలో నిలిచింది. అలాగే.. తెలంగాణలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ పి.విని సూపర్ కోచ్‌లు/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్‌లలో ఒకరిగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డా.గౌరవ్ ఉప్పల్ తో పాటు భద్రాద్రి కొత్తగూడెం,ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేష్ వి పాటిల్, వెంకటేశ్ ధోత్రే లు, ఆదిలాబాద్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మత్, ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, ట్రైబల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ సముజ్వల పాల్గొన్నారు.




## భూదాన్ భూములపై హైకోర్టు కీలక నిర్ణయం

### ఐఏఎస్‌కు వ్యతిరేకంగా వేసిన పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్, అక్టోబరు 17 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం భూదాన్ భూముల వ్యవహారం పై తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ ను కొనుగోలు చేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని వేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. సర్వే నెంబర్ 194, 195 భూదాన్ భూమిని అక్రమంగా మ్యుటేషన్ చేసి అన్యాక్రాంతం చేశారంటూ పిటిషనర్ తరఫున లాయర్ హైకోర్టు వాదించారు. అయితే పిటిషనర్ వాదనలను ధర్మాసనం ఏకీభవించలేదు. ఈ కేసులో ఇంప్లీడ్ పిటిషన్లు , ఇంటర్‌లోక్యుటరీ అప్లికేషన్ పిటిషన్లు కూడా హైకోర్టు కొట్టి వేసింది. మరోవైపు భూదాన్ భూముల వ్యవహారంలో ప్రధాన కేసు విచారణ మాత్రం కొనసాగుతూనే ఉంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని నాగారంలోని 181, 182 సర్వే నెంబర్‌లో సుమారు 103 ఎకరాలు భూదాన్ భూమి ఉంది. ఈ భూమిపై గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. అందులో సుమారు 50 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం హైకోర్టు కోర్టు పరిధిలో ఉంది. దీంతో ఈ భూములకు సంబంధించి లావాదేవీలపై కోర్టు స్టే విధించింది. ఇక ఈ అంశంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు.. గతంలో ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన ఈడీ అధికారులు గుర్తించారు.

## పత్తిని కేంద్రమే కొనుగోలు చేస్తుంది

### సీసీఐ ద్వారా క్వింటాల్ పత్తి రూ.8,110కు కొనుగోలు

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,అక్టోబర్17 : కేంద్ర ప్రభుత్వం పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. క్వింటాల్ పత్తి రూ.8,110 ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో పత్తి సాగు ఉత్పత్తి పెరుగుతోందని.. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ముందు ఉందన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా సాగవుతున్న పంట పత్తి అని.. రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని తెలిపారు. 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. పత్తి రైతులు దళారుల చేతిలో పడి మోస పోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. కొనుగోలు కేంద్రాలను మరో 12పెంచామని.. మొత్తం 122 కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు కేంద్రమంత్రి. పత్తి సాగు ఉత్పత్తిలో సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. తొమ్మిది ప్రాంతీయ భాషల్లో పత్తి సాగుకు సంబంధించి కిసాన్ యాప్‌ను తీసుకొచ్చామని.. యాప్‌లో రైతులు నమోదు చేసుకుంటే.. స్లాట్ ద్వారా పత్తిని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని అన్నారు. పత్తి శుద్ధి, రవాణా కోసం జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ వల్ల పంట దిగుబడి డబుల్ అవుతుందని తెలిపారు. మహారాష్ట్ర అకోలా ప్రాంత ప్రజలు హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేస్తున్నారని.. హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్‌పై అవగాహన కోసం అవసరమైతే రైతులను మహారాష్ట్రకు తీసుకెళ్తామని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి మన రైతులు హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేసేలా పని చేస్తామన్నారు. కిసాన్ యాప్ దీపావళి నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పదేళ్లలో కనీస మద్దతు ధర వంద శాతం పెరిగిందన్నారు. నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయని.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ పెట్టీ జైలుకు పంపుతున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## మారుమూల గ్రామాలకు సైతం నెట్ సేవలు

### రూ.5 వేల కోట్ల నిధులతో పోస్టల్ సంస్థ బలోపేతం

### కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

న్యూఢిల్లీ,అక్టోబరు17 : భారతదేశంలో ప్రతి మారుమూల గ్రామానికి భారత్ నెట్ సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతంలో పరిశ్రమలు రావడానికి కావలిసిన ఎకో సిస్టమ్స్ అభివృద్ధి చేయడానికి అనేక రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒకసారి ఎకో సిస్టమ్ ఏర్పాటు అయిన తర్వాత రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని చెప్పుకొచ్చారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. ఖర్చులు ఎక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉండే పోస్టల్ డిపార్ట్‌మెంట్ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రూ.5 వేల కోట్ల నిధులతో పోస్టల్ సంస్థ నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే కాలంలో పోస్టల్ సంస్థను ఆదాయం అందించే సంస్థగా తీర్చిదిద్దుతామని పెమ్మసాని చంద్రశేఖర్ ఉద్ఘాటించారు.ప్రస్తుతం గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటైన తర్వాత చాలా సంస్థలు ఆ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయని వివరించారు. బెంగళూర్ లాంటి ప్రాంతాల్లో ఒక ఎకో సిస్టం ఏర్పాటైందని.. ఆ ప్రాంతంతో విశాఖపట్నానికి పోలిక అవసరం లేదని స్పష్టం చేశారు. పోస్టల్, బీఎస్ఎన్ఎల్, తదితర సంస్థలను కామన్ మ్యాన్‌కు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచడానికి దాదాపుగా 20 వేల కొత్త సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వినియోగదారుల భద్రత కోసం సంచార్ సాతి యాప్ సేవలను అందిస్తున్నామని తెలిపారు. టెలికాం వినియోగదారులన్ను ÷నాన్షియల్ ఫ్రాడ్‌ల నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.



## రూ.110 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం

### ఆక్రమణ చెరనుంచి రక్షించిన హైడ్రా

హైదరాబాద్,అక్టోబరు17 : హైడ్రా మరో భూమికి విముక్తి కలిగించింది. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని కుల్సుంపురాలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. రూ.110 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ప్రజావసరాలకు ఈ భూమిని వినియోగించాలని గతంలో ప్రభుత్వం భావించింది. మరోవైపు అశోక్ సింగ్ అనే వ్యక్తి దీన్ని తన భూమిగా చెబుతున్నాడు. ఈక్రమంలో సిటీ సివిల్ కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ భూమిలో ఇప్పటికే రెండు సార్లు రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. అయినా అశోక్ సింగ్ స్థలాన్ని ఖాళీ చేయడంలేదు. మరోవైపు ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన అధికారులపై దాడులకు పాల్పడ్డాడు. అశోక్ సింగ్‌పై లంగర్‌హౌస్, మంగళ్‌హాట్, శాహినాయత్‌గంజ్ పోలీసు స్టేషన్లలో 8కి పైగా కేసులు నమోదయ్యాయి. ఈ క ÷రమంలో హైడ్రా అక్కడ కూల్చివేతలు చేపట్టి, భూమిని స్వాధీనం చేసుకుంది.

## హైదరాబాద్‌లో ఫారెక్స్ సంస్థలపై ఇడి దాడులు

హైదరాబాద్,అక్టోబర్17: నగరంలోని విదేశీ నగదు మార్పిడి (ఫారెక్స్) సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (అధికారులు దాడులు నిర్వహించారు. ఆర్‌బీఐ లైసెన్స్ లేకుండానే సంస్థలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులపై ప్రిజమ్, గరుడ, విక్టరీ, విమల్‌నాథ్ ఫారెక్స్ సంస్థల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. గతంలో ఆర్‌బీఐ అధికారులు నిర్వహించిన దాడుల్లోనూ ఆయా సంస్థల్లో అవకతవకలు బయటపడ్డాయి. దీంతో ఈడీ కూడా దాడులు చేసింది. అయితే, ఆర్‌బీఐ అనుమతి లేకుండానే బోగస్ పత్రాలతో సంస్థలు నడిపిస్తున్నట్టు బయటపడింది. ప్రిజం ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, విక్టరీ ఫారెక్స్, ట్రావెల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, డిజిటల్ ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి కొన్ని సంస్థలు... అక్రమంగా డబ్బు మార్పిడి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయని ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. ఆయా సంస్థలు ఫెమా నిబంధనలు ఉల్లంఘించాయని ఈడీ పేర్కొంది. ఈ మేరకు దాడుల్లో నకిలీ పత్రాలు, ల్యాప్ టాప్, మొబైల్ ఫోన్‌లు రూ.11.99 లక్షల నగదు, రూ.26.77 లక్షల విదేశీ మారకం స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ అధికారులు తెలిపారు.

## శాస్త్రీయ పురాతన పద్ధతుల్లో లీకేజీ నివారణ

సింహాచలం,అక్టోబర్17: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలం ఆలయం పైకప్పు మరమ్మతు పనులను పురాతన శాస్త్రీయ విధానంలో చేపట్టడం వల్ల మరో 200 ఏళ్లపాటు లీకేజీ సమస్యలు ఉత్పన్నం కావని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో చేపడితేనే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. దేవాలయాల్లో ఇలాంటి పద్ధతులే అవలంబిస్తారని గంటా అభిప్రాయపడ్డారు. పైకప్పు లీకేజీల నివారణ ప్రాజెక్టు పనులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు.

## ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వానికి లేఖ

### హైకోర్టుకు వివరించిన ఇసి తరఫు లాయర్

హైదరాబాద్,అక్టోబరు17 : బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంపై ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది విద్యాసాగర్ హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం నుంచి సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ సురేందర్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని గత విచారణ సందర్భంగా ఆదేశించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నిక ల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం రిజర్వేషన్లను మరోసారి ఖరారు చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ కూడా రాశామని.. సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామని వివరించారు. ప్రభుత్వం నిర్ణయం చెప్పడానికి 3 వారాల సమయం కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టును కోరారు. ఈక్రమంలో ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు 2 వారాల గడువు ఇచ్చి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

## నిమ్స్‌లో వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి

### ఆపరేషన్ థియేటర్‌లో విగతజీవిగా ఉండగా గుర్తింపు

హైదరాబాద్,అక్టోబర్17 : నగరంలోని నిమ్స్ ఆసుపత్రి అనస్థీషియా వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి తీవ్ర కలకలం రేపుతోంది. మృతుడు బీఎస్సీ నర్సింగ్ చేస్తున్న నితిన్‌గా గుర్తించారు. గురువారం విధులకు హాజరైన నితిన్.. శుక్రవారం ఉదయం ఆపరేషన్ థియేటర్లో విగతజీవిగా పడి ఉన్నాడు. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చనిపోయిన విద్యార్థి నిమ్స్‌లో న్యూరో సర్జరీ ఆపరేషన్ థియేటర్ అనస్థీషియా టెక్నీషియన్‌గా ఉన్నారు. నిమ్స్‌లోనే బీఎస్సీ నర్సింగ్ చేస్తున్నాడు. అయితే మరికొద్ది రోజుల్లో ఇంటర్నెట్ షిప్ పూర్తవుతుందనుకున్న సమయంలో నితిన్ ఇలా చనిపోవడం సహచరులను షాక్‌కు గురిచేసింది. బోరబండలోని గవర్నమెంట్ హాస్టల్లో ఉంటూ నిమ్స్‌లో నితిన్ ఇంటర్న్ షిప్ చేస్తున్నాడు. అయితే రాత్రి విధులకు హాజరైన నితిన్ అర్ధరాత్రి కనిపించకుండాపోయాడు. ఉదయానికి ఆపరేషన్ థియేటర్‌లో డోర్ వెనకాల అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. నితిన్‌ను గమనించిన హౌస్ కీపింగ్ సిబ్బంది వెంటనే నిమ్స్ సిబ్బందికి తెలియజేశారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఘటనా స్థలి నుంచి తరలించారు. కాజ్ ఆఫ్ డెత్‌పై పోలీసులు విచారణ చేపట్టారు. అలాగే అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించడం మొదలుపెట్టారు. నితిన్ ఆఖరి సారిగా ఎవరితో మాట్లాడాడు అనే దానిపై అతడి ఫోన్ కాల్ డేటాను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## రివాబాకు మంత్రి పదవి ఆనందదాయకం

### ఎక్స్ వేదికగా స్పందించిన భర్త జడేజా

**గాంధీనగర్, అక్టోబర్ 17 :** గుజరాత్ మంత్రిగా తన సతీమణి రివాబా జడేజా ప్రమాణస్వీకారం చేయడంపై టీమ్ ఇండియా క్రికెటర్ రవీంద్ర జడేజా ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు మంత్రి పదవి దక్కడంపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'మీరు సాధించిన విజయాలకు ఎంతో గర్వపడుతున్నా. ఇలాగే అద్భుతమైన కృషి చేస్తారని, అన్ని వర్గాల ప్రజలకు ప్రేరణగా నిలుస్తారని నాకు తెలుసు. గుజరాత్ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను.. జైహింద్' అని పేర్కొన్నారు. వ్యవస్థాగత, రాజకీయ సవాళ్లను ఎదుర్కొనే లక్ష్యంతో గుజరాత్‌లో క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలనే ప్రణాళికలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా గుజరాత్ మంత్రులందరూ తమ పదవులకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం ఏర్పాటైన కొత్త క్యాబినెట్‌లో జడేజా సతీమణి రివాబా జడేజాకు చోటు దక్కింది. ఆమెకు ప్రాథమిక, మాధ్యమిక, వయోజన విద్యాశాఖను కేటాయించారు.

## హైదరాబాద్‌లో ఫారెక్స్ సంస్థలపై ఈడీ దాడులు

**హైదరాబాద్, అక్టోబర్ 17 :** నగరంలోని విదేశీ నగదు మార్పిడి (ఫారెక్స్) సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (అధికారులు దాడులు నిర్వహించారు. ఆర్‌బీఐ లైసెన్స్ లేకుండానే సంస్థలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులపై ప్రిజమ్, గరుడ, విక్టరీ, విమల్‌నాథ్ ఫారెక్స్ సంస్థల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. గతంలో ఆర్‌బీఐ అధికారులు నిర్వహించిన దాడుల్లోనూ ఆయా సంస్థల్లో అవకతవకలు బయటపడ్డాయి. దీంతో ఈడీ కూడా దాడులు చేసింది. అయితే, ఆర్‌బీఐ అనుమతి లేకుండానే బోగస్ పత్రాలతో సంస్థలు నడిపిస్తున్నట్టు బయటపడింది. ప్రిజం ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, విక్టరీ ఫారెక్స్, ట్రావెల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, డిజిటల్ ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి కొన్ని సంస్థలు... అక్రమంగా డబ్బు మార్పిడి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయని ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. ఆయా సంస్థలు ఫెమా నిబంధనలు ఉల్లంఘించాయని ఈడీ పేర్కొంది. ఈ మేరకు దాడుల్లో నకిలీ పత్రాలు, ల్యాప్ టాప్, మొబైల్ ఫోన్‌లు రూ.11.99 లక్షల నగదు, రూ.26.77 లక్షల విదేశీ మారకం స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ అధికారులు తెలిపారు.

## అటవీ అధికారులపై గిరిజనుల దాడి


**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 17 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఫారెస్ట్ సిబ్బందిపై ఆదివాసీ పోడు రైతులు శుక్రవారం వేట కొడవళ్లతో దాడి చేశారు. కరకగూడెం మండలం అశ్వాపురపాడు గ్రామం అటవీ ప్రాంతంలో దాడి చేశారు వలస ఆదివాసీ పోడు రైతులు. పోడు భూమిలో ఆదివాసీ గిరిజనులు హార్వెస్టర్ మిషన్ ద్వారా వరి పంట కోస్తుండగా ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. దీంతో అధికారులపై ఆగ్రహంతో వలస ఆదివాసీ గిరిజనులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు గోవింద్, కోటేష్‌కి గాయాలయ్యాయి. గాయాలైన అధికారులకి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు ఆదివాసీ పోడు రైతులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఫారెస్ట్ అధికారులపై దాడి చేస్తే ఊరుకునేది లేదని ఆదివాసీ పోడు రైతులని పోలీసులు హెచ్చరించారు.

## సోషల్ సర్వేలో పాల్గొనకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నా

### నారాయణమూర్తి దంపతుల తీరుపై ఘాటుగా స్పందించిన సిఎం

**బెంగళూరు, అక్టోబరు 17 :** కర్ణాటకలో జరుగుతున్న సోషల్ అండ్ ఎడ్యుకేషన్ సర్వేకు దూరంగా ఉండాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి , సుధామూర్తి నిర్ణయం తీసుకోవడంపై ముఖ్యమంత్రి సిద్దారామయ్య శుక్రవారం నాడు ఘాటుగా స్పందించారు. తాము చేపట్టినది వెనుకబడిన తరగతుల సర్వే కాదని, జనగణన అని చెప్పారు. 'అది వాళ్లకే వదిలిపెట్టాను. ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదు. వాళ్లకి అర్థం కాకపోతే నేను ఏం చేయగలను? ఇన్ఫోసిస్‌లో ఉన్నంత మాత్రానా వాళ్లు సర్వజ్ఞులా. ఇదెంత మాత్రం వెనుకబడి తరగతుల సర్వే కాదని 20 సార్లు చెప్పాం. ఇది మొత్తం జనాభాను లెక్కించే సర్వే' అని సిద్ధరామయ్య తెలిపారు. కర్ణాటక వెనుకబడి తరగతుల కమిషన్ చేపట్టిన 'సోషల్ అండ్ ఎడ్యుకేషనల్ సర్వే'లో పాల్గొనరాదని నారాయణ మూర్తి దంపతులు నిర్ణయం తీసుకున్నారు. ఎన్యూమరేషన్ కోసం ఆ దంపతుల ఇంటికి వెళ్లినప్పుడు తమకు సర్వే అక్కర్లేదని చెప్పినట్టు అధికారులు తెలిపారు. తాము వెనుకబడిన తరగతులకు చెందిన వారముకాదని, ఆ సామాజిక వర్గం కోసం నిర్వహిస్తున్న సర్వే కావడంతో తాను ఇందులో పాలుపంచుకోవడం లేదని నారాయణ మూర్తి దంపతులు తెలిపారు. తమ విషయంలో సర్వేకు ఎలాంటి ఔచిత్యం లేదని ప్రకటిస్తూ సర్వే ఫారంపై సుధామూర్తి సంతకం చేసినట్టు తెలుస్తోంది. ఈ పక్రియకు దూరంగా ఉంటున్నట్టు పేర్కొంటూ మూర్తి దంపతులు డిక్లరేషన్ కూడా ఇచ్చారు. ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి దంపతులు సోషల్ అండ్ ఎడ్యుకేషన్ సర్వేకు దూరంగా ఉండాలని తీసుకున్న నిర్ణయంపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ, సర్వేలో పాల్గొనమని తాము ఎవరినీ బలవవంత పెట్టడం లేదని, ఐచ్ఛికంగా సర్వేలో పాల్గొనవచ్చని చెప్పారు. కాగా, ఇన్ఫోసిస్ మాజీ సీఈవో మోహన్‌దాస్ పాయ్ సైతం కులసమీకరణపై విమర్శలు గుప్పించారు. 'ఉద్యోగులకు లభిస్తున్న పెద్ద పేమెంట్లు, ప్రయోజనాలతో పోల్చుకుంటే ఇది చాలా చిన్నది. కర్ణాటకలో మంత్రలకు మంచి ఉద్యోగాలు, టక్నాలజీ, అభివృద్ధి కంటే కులం, కుల సర్వేలు, బుజ్జగింపులపైనే ఎక్కువ ఆసక్తి ఉంది' అని అన్నారు. కర్ణాటక హైకోర్టు కూడా ఇటీవల తమ ఉత్తర్వుల్లో సోషియో-ఎకానమిక్, ఎడ్యుకేషన్ సర్వే తప్పనిసరి కాదని బహిరంగంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వివరాలపై సర్వేయర్లు పట్టుబట్ట రాదని, సేకరించిన సమాచారం మొత్తం బీసీ కమిషన్‌కు మినహా పూర్తి కాన్ఫిడెన్సియల్‌గా ఉంచాలని ఆదేశాలిచ్చింది. వెనుకబడిన తరగతుల వారికి ప్రయోజనాలు చేకూర్చేందుకు ఉద్దేశించిన సర్వేలోని సమాచారం పౌరుల హక్కులను ఉల్లంఘించేలా ఉండరాదని పేర్కొంది.

# కాంగ్రెస్ ముసుగు తొలగుతోంది!



**రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. త్వరలోనే అంటే డిసెంబర్‌లో రెండేళ్ల వార్షికోత్సవాలు ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో పార్టీలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ప్రభుత్వంలో, పార్టీలో ఎవరికి వారే యమునాతీరే అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అసలురంగు మెల్లగా బయటకు వస్తోంది. అధికారంలో ఉంటే అవినీతి అన్నది దానిచుట్టూ పెనవేసు కుంటుంది. మంత్రుల అవినీతిపై ఊరూవాడా గుసగుసలు ఎక్కువయ్యాయి. బిఆర్ఎస్ అవినీతి గురించి తిట్టిపోస్తున్నా... రెండేళ్ల కాలంలో ఒక్కటీ రుజువు చేయలేదు. ఒక్కరిపైనా చర్య తీసుకోలేదు. ప్రచారం కోసం మాత్రం అవినీతిని వాడుకుంటున్నారు.**

ఇకపోతే సిఎం రేవంత్ రెడ్డి కూడా తనమానాన తన పనులు చేసుకుంటూ పోతున్నట్లుగా ఉంది. ఇటీవల మంత్రుల మధ్య కులపంచాయితీ మొదలయ్యింది. పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ కుమార్ మధ్య పంచాయితీ సద్దుమణిగిందని అనిపించారు. అడ్లూరి, వివేక మధ్యన కూడా గొడవలు ఉన్నాయి. మంత్రుల్లో ఒకరంటే ఒకరికి గిట్టడం లేదు. ఇకపోతే బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన తరవాత జివో ఇవ్వడం, హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో కేసుల వేయడం ద్వారా కాంగ్రెస్ అపరిపక్వ విధానాలు తేటతెల్లం అయ్యాయి. ఓ రకంగా పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తూ ముందుకు సాగివుంటే ఇంత పంచాయితీ వచ్చేది కాదు. ఈ విషయంలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారు. దీనిపై ఎంతధనం వెచ్చించారో ప్రజలకు చెప్పాలి. హైకోర్టు, సుప్రీంకోర్టు, లాయర్లు, మంత్రుల ఢిల్లీ పర్యటనల ఖర్చులు తెలియచేసి నిజాయితీ చూపాలి. ఇకపోతే ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అనర్హులకు కేటాయించారంటూ పలు జిల్లాల్లో ప్రజలు రోడ్డెక్కి నిలదీస్తున్నారు. కిలో రూపాయికి సన్న బియ్యం దాదాపు అందరికీ ముడుతున్నాయి. అందువల్ల పంచాయితీ రావడం లేదు. దుబారాను ఎలాగూ పట్టించుకోరన్నది తేలింది. ఇకపోతే మంత్రులపై వస్తున్న అవినీతిపైనా చర్చించాలి. కానీ చెప్పడం లేదు. ఇచ్చిన హామీలంటూ అనేకం అమలు చేయలేదు. కనీసం గ్రామస్థాయిలో ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్న బాధ్యతను కూడా ప్రభుత్వం ప్రదర్శించడం లేదు. వర్షాలకు రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఎక్కడా తట్టెడు మన్ను పోయడం లేదు. ఉద్యోగుల్లో అవినీతి పెరిగింది. డబ్బులు లేనిదే ఫైలు కదలడం లేదు. ఎసిబి నామమాత్రపు దాడులను ఉద్యోగులు లెక్కచేయడం లేదు. ఇక కొత్తగా కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు నడుస్తోంది.ఆమె అవినీతిలో కూరుకుపోతున్న వైనం బాహాటంగా వినవస్తోంది.

ఇటీవల జరుగుతున్న వరుస పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తున్నది. దీనికితోడు సిఎం, మంత్రులు తనపై కక్షకట్టారని కొండా దంపతులు, కుటుంబం కూడా ఆరోపిస్తోంది.తాజాగా కేబినేట్‌కు డుమ్మా కొట్టారు. మొన్నటికి మొన్న మేడారం సమీక్షకు కూడా దూరంగా ఉన్నారు. రేవంత్‌రెడ్డి బుధవారం పరామర్శ పేరుతో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులందరూ హాజరైనా మంత్రి కొండా సురేఖ మాత్రం ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనుల్లో ఆమె ప్రమేయం లేకుండా ఇన్‌చార్జి మంత్రి పేరుతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నీ తానై వ్యవహరిస్తుండటం మంత్రి సురేఖకు ఆగ్రహం తెప్పించిందని అంటున్నారు. దీనికి తోడు మేడారం టెండర్ల లీకు వ్యవహారంలో సురేఖ ఓఎస్డీ సుమంత్ పాత్ర ఉన్నదనే అనుమానంతో ప్రభుత్వం ఆయనను ఆ పోస్టు నుంచి తొలగించింది. సుమంత్ కొండా సురేఖ నివాసంలోనే ఉన్నారన్న సమాచారంతో బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంత్రి ఇంటికి వెళ్లారు. ఈ పరిణామాలన్నింటి వెనుక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారని కొండా సురేఖ కుమార్తె సుస్మితాపటేల్ ఆరోపించారు. ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబంపై సురేఖ చేసిన వ్యాఖ్యల నుంచి ఆమె ఓఎస్డీ తొలగింపు వరకు చోటుచేసుకుంటున్న పరిణామాలు సంచలనంగా మారాయి. అయితే, ప్రతి ఘటనను తనకు అనుకూలంగా మలచుకున్న కొండా సురేఖ ఈసారి మాత్రం తమను 'రెడ్డి' సామాజికవర్గం టార్గెట్ చేసిందని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి ముసలం పుట్టిందా అన్ని చర్చ సాగుతోంది. ఇన్నాళ్లూ గుట్టుగా సాగిన అవినీతి బయట ప్రజల్లో చర్చకు దారితీస్తోంది.

మంత్రుల మధ్య వివాదాలు, కొండా సురేఖ వర్సెస్ పొంగులేటి, మేడారం టెండర్లు.. ఇలా కొన్నిరోజులుగా బయటికి వచ్చినవన్నీ కొన్ని మాత్రమే. కానీ, తెరవెనక అవినీతి అనకొండలు ఉన్నట్టు మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్ వ్యవహారంతో బయటపడింది. మేడారం టెండర్ల నేపథ్యంలో మంత్రుల మధ్య విబేధాలు బయటపడినట్టు కనిపిస్తున్నా..ఈ వ్యవహారం కొండా సురేఖ చుట్టే తిరిగిందని ప్రచారం జరుగుతున్నది. సూర్యాపేట జిల్లాలోని సున్నపురాయి గనులను నిబంధనలకు విరుద్ధంగా రెండు సిమెంటు కంపెనీలకు కట్టబెట్టడంతో వచ్చిన ముడుపుల వ్యవహారమని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇకపోతే దక్కన్ సిమెంట్ కంపెనీపై అక్రమ మైనింగ్ వ్యవహారంలో భారీ జరిమానా పడినట్టు సమాచారం. మైనింగ్‌లో గనులతో పాటు అటవీ శాఖకు కూడా సంబంధం ఉంటుంది. కంపెనీల వ్యవహారంపై కొంతకాలం కిందట మంత్రి కొండాకు ఉప్పందడంతో ప్రత్యేక దృష్టిపెట్టినట్టు తెలుస్తున్నది. ఈక్రమంలోనే సుమంత్ రంగంలోకి దిగి కంపెనీతో డీల్‌కు ప్రయత్నించాడనే ఆరోపణలున్నాయి. ఈ పరిణామాల వల్లే మేడారం పనుల్లో సురేఖను దూరం పెట్టడం, ఓఎస్డీని తొలగించి మంగళవారం రాత్రి కొండా నివాసానికి పోలీసులను ఉసిగొల్పినట్టు స్పష్టమవుతున్నది. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం ఒక్కటే కనిపిస్తున్నా అనేక విధాలుగా అవినీతి గుప్పుమంటోంది. కెసిఆర్‌ను తిట్టిపోస్తూ ...వీరు కూడా అలాగే తయారయ్యారన్న ప్రచారం సాగుతోంది. పనులకు, బిల్లులకు పర్సెంటీజుల లేనిదే రావడం లేదంటున్నారు. కాంగ్రెస్ అవినీతి ఎప్పటికైనా బద్దలు కాక తప్పదని బిఆర్ఎస్ ధీమాగా ఉంది. తమ అవినీతి వ్యవహారం ఇక బయటకు రాదన్న భరోసా కూడా ఉంది.

# కాంగ్రెస్‌లో కరుగుతున్న కొండ

- ఏకాకిని చేసే ప్రయత్నాలు మొదలు
- వరుస ఘటనలే నిదర్శనమంటున్న పరిశీలకులు



**వరంగల్, అక్టోబర్ 17 :** వరంగల్ కాంగ్రెస్‌లో రాజకీయ కుంపటి రగులుతూనే ఉంది. వరుసగా జరుగుతున్న పరిణామాలు మరింత రోత పుట్టిస్తున్నాయి. తాజా పరిణామాల వెనక ఉన్నది సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డేనని కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఆరోపించారు. తమపై రెడ్డికులాల ఆధిపత్యం రదుస్తోందని ఆమె ఘాటుగానే వ్యాఖ్యానించారు. వీరంతా కలసి తమ కుటుంబాన్ని టార్గెట్ చేశారని మండుతున్నారు. తమది కాంగ్రెస్ రక్తమని చెప్పుకుంటున్న కొండా సురేఖ మధ్యలో కొన్ని సంవత్సరాలు మాత్రం బీఆర్ఎస్‌లో కొనసాగారు. ఈ క్రమంలో టీడీపీలో పనిచేసి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు తమను టార్గెట్ చేశారని కొండా సురేఖ ఆరోపిస్తున్నారు.వీరికి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్ని విధాలా సహకరిస్తున్నారని గాంధీభవన్ వేదికగా ఆరోపించారు. ఇదే విషయమై అప్పటి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ప్రస్తుత ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వరకు, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నుంచి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే వరకు ఫిర్యాదు చేస్తూ వచ్చారు. మరోవైపు, కొండా సురేఖ, కొండా మురళీధర్‌రావుకు వ్యతిరేకంగా కూడా ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. నిత్యం వార్తల్లో ఉండటం, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, తమది మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ అని చెప్పడం, గల్లీ నుంచి ఢిల్లీ దాకా పరిచయాలు ఉండడం, సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ పేరుపెట్టి పిలిచే నాయకురాలిగా పేరు తెచ్చుకోవడంతోపాటు, చెప్పినట్టు వినరనే కారణంతో కొండా దంపతులను రేవంత్‌రెడ్డి టార్గెట్ చేశారని వీరు ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి నటుడు నాగార్జున అంశంలోనే సురేఖపై వేటు తప్పదన్న వార్తలు వినిపించాయి. అప్పట్లో ఆమెను తప్పించాల్సిందేనని వైరివర్గం అధిష్ఠానానికి ఫిర్యాదు కూడా చేసింది. ఈ ఫిర్యాదుల వెనక కూడా రెడ్డి సామాజికవర్గమే ఉన్నదని, రేవంత్‌రెడ్డి అండ చూసుకుని తమను వేధిస్తున్నారని అప్పట్లో కొండా దంపతులు ఆరోపించారు. ఇక గనుల వ్యవహారానికి వస్తే .. అక్రమాల నేపథ్యంలో దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి రూ.300 కోట్ల జరిమానా విధిస్తూ రాష్ట్ర పర్యావరణ శాఖ నోటీసులు పంపింది. ఆ నోటీసులతో బిత్తరపోయిన కంపెనీ యాజమాన్యం పలువురు ప్రభుత్వ పెద్దల వద్ద మొరపెట్టుకున్నట్టు సమాచారం. దీంతో బంతి తన కోర్టులోకి వచ్చిందని నిర్ధారించుకున్న ఓఎస్డీ సుమంత్.. కంపెనీ యాజమాన్యంతో బేరసారాలు చేసినట్టు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో జరిగిన వ సూళ్ల, పంపకాల తేడాతో వ్యవహారం రచ్చకెక్కినట్టు చెప్తున్నారు. తాజా పరిణామాలపై సురేఖ కూతురు సుస్మిత సెల్ఫీవీడియో ద్వారా అందించిన వివరాలతో తీగ లాగితే హుజూర్‌నగర్‌లోని సున్నపురాయి నిక్షేపాల డొంక కదులుతున్నదని స్పష్టమవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాం లో ఇదే అంశంపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తు జరిపారు. సుల్తాన్‌పూర్ రిజర్వు ఫారెస్టులో ఎన్‌సీఎల్ అనుమతికి మించి సున్నపురాయి నిక్షేపాలను తవ్వుతున్నట్టు దర్యాప్తులో తేలింది. ఆ నివేదికలోని సిఫారసు మేరకు రాష్ట్ర గనులు, భూ గర్భ శాఖ 2021లోనే ఆ కంపెనీకి రూ.91.42 కోట్ల జరిమానా కూడా విధించింది. అయితే తాజా ఈ–టెండర్లలో ఎన్‌సీఎల్ సరిగ్గా ఇదే బ్లాకుకు బిడ్ దాఖలు చేసి మైనింగ్ లీజు దక్కించుకోవడం గమనార్హం. కానీ మిగిలిన రెండు బ్లాకుల జోలికి వెళ్లలేదు. గనుల వ్యవహారంలో రూ.1500 కోట్ల స్కాం జరిగిందని వెంటక్ రెడ్డి అనే వ్యక్తి పేర్కొన్నారు. దీనిపై అతను సమాచారశాఖ ద్వారా ఫిర్యాదు చేస్తే... ఆ ఫిర్యాదును రాష్ట్ర గనుల శాఖకు పంపినట్టు సమాధానం ఇచ్చి చేతులు దులుపుకొన్నది. మొత్తంగా ఇప్పుడు పార్టీలో కొండా సురేఖ ఏకాకి అయ్యారనే అంటున్నారు. రాజకీయంగా ఆమెను ఒంటరి చేశారని అంటున్నారు.

# దీపావళి ముందు రోజు ధనత్రయోదశి

## బంగారం వెండి కొనుగోళ్లపై ఉత్తరాదిలో నమ్మిక



**న్యూఢిల్లీ, అక్టోబర్ 17 :** ధంతేరస్... దీపావళి పండుగకు ముందు త్రయోదశి నాడు వస్తుంది. ఆశ్వయుజ బహుళ త్రయోదశి నాడు ధంతేరస్ పర్వదినం జరుపుకుంటారు. అందుకే ధంతేరస్‌ను ధనత్రయోదశి అని కూడా పిలుస్తారు. ఈ ఏడాది అక్టోబర్ 18న శనివారం ధంతేరస్ వచ్చింది. ధంతేరస్‌తోనే దీపావళి పండుగ వేడుకలు మొదలవుతాయి. ఐదు రోజుల పాటు సాగుతాయి. అంతేకాదు.. దీపావళికి ముందు వచ్చే ఈ త్రయోదశిని ధంతేరస్.. ధన త్రయోదశి.. చోటీ దీపావళి అంటారు. ఇక ధంతేర‌స్‌ను ధనలక్ష్మిని ఆరాధించే పవిత్రమైన రోజుగా అభివర్ణిస్తారు. భక్తుల కోరికలను తీర్చడానికి 'అదృష్ట లక్ష్మి' తనను పూజించే ప్రతి ఇంటికీ ఈ రోజు అతిథిగా విచ్చేస్తుందన్నది ఒక నమ్మకం. అందుకే ఈ పండుగ రోజు బంగారం, వెండి వంటి వస్తువులు కొనుగోలు చేయడం శుభప్రదమని ప్రజల విశ్వాసం. ధనత్రయోది రోజున కొంచెంకానీ బంగారం, వెండి కొనుగోలు చేస్తుంటారు ప్రజలు. ఇక వ్యాపారులు కొత్త ఒప్పందాలు చేసుకోవాలన్నా, నూతన వ్యాపార లావాదేవీలకు శ్రీకారం చుట్టాలన్నా, పెట్టుబడులు పెట్టాలన్నా 'ధన్‌తేరస్' అనువైన రోజగా భావిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ధంతేరస్‌ను 'అదృష్ట లక్ష్మి' అతిథిగా వచ్చే రోజుగా భావిస్తారు. ధన త్రయోదశి అంటే సంపద, శ్రేయస్సు పెంచే త్రయోదశి అని అర్థం. ధంతేరస్ నాడు ధన్వంతరికి, కుబేరుడితోపాటు లక్ష్మీదేవికి పూజలు చేస్తారు. దేవదానవులు సముద్ర మథనం చేస్తున్న వేళ.. ధన్వంతరి భగవానుడి చేతిలో కలశంతో దర్శనం ఆచ్చారని అంతా నమ్ముతారు. మరి కొన్ని చోట్ల అపమృత్యు నివారణ కోసం దీపాలను వెలిగించడం సంప్రదాయం. ధనత్రయోదశినే కొన్ని ప్రాంతాల్లో 'యమ త్రయోదశి' అని కూడా పిలుస్తారు. ఈ రోజున సాయంత్రం భక్తులందరూ లక్ష్మీదేవిని పూజిస్తారు. ఇంటి చుట్టూ దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని ఆరాధిస్తారు. ఈ పూజలో భాగంగా గోధుమ, పెసలు, మినుములు, కందులు, బార్లీ .. మొదలైన వాటిని అమ్మవారికి సమర్పిస్తారు. అలాగే అపమృత్యు నివారణ కోసం నూనెతో దీపం వెలిగిస్తారు. దీనినే 'యమదీపం' అని కూడా అంటారు. దంతేరస్ నాడు బంగారం, వెండి.. విలువైన ఆభరణాలను కొనుగోలు చేస్తే కలిసిరావడంతోపాటు శుభప్రదం అని చెబుతారు. ఇది సంపద, అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. ఈ రోజు ఏం కొనుగోలు చేసినా రెట్టింపవుతుందని విశ్వాసం. అందుకే ఈ పర్వదినం నాడు బంగారం, వెండితోపాటుగా ఇంట్లోకి అవసరమైన ఇతర వస్తువులను కూడా కొనుగోలు చేస్తారు. బంగారం, వెండి వస్తువులతోపాటు వెండి లక్ష్మి, గణేశుడి విగ్రహాలను కొనుగోలు చేయవచ్చు. చీపురును లక్ష్మీదేవి రూపంగా పరిగణిస్తారు. ఈ రోజు చీపురు కొనడంతో పేదరికం, కష్టాలు, అనారోగ్య సమస్యలతోపాటు ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని ప్రతీతి. వాహనం కొనడం కూడా శ్రేయస్కరమే. అయితే పెరుగుతున్న బంగారం, వెండిలతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.



# లొంగిపోయిన మావో అగ్రనేత ఆశన్న

- ఆశన్న సహా 208మంది మావోల లొంగుబాటు
- భారీగా ఆయుధాలు అప్పగింత
- వారి పునరావాసానికి ఏర్పాట్లు చేస్తామన్న ఛత్తీస్‌ఘడ్ సిఎం

**రాయపూర్, అక్టోబర్ 17 :** మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ పోలీసుల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు. వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 153 ఆయుధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే–47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి. ఈ లొంగుబాటుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మాట్లాడారు. ఇది ఛత్తీస్‌గఢ్‌కే కాదు దేశం మొత్తానికి చరిత్రాత్మకమైన రోజు. హింసను వీడి జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని మేం వారిని కోరుతూ వచ్చాం. ఇప్పుడు వారికి నైపుణ్యాలు కల్పించి, పునరావాసానికి ఏర్పాటు చేస్తాం అని వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిసిన గంటల వ్యవధిలోనే ఆశన్న లొంగుబాటు ప్రకటన వచ్చింది. ఇద్దరు అగ్రనేతలు పోరాటాన్ని వీడటంతో మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్‌వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం అప్పటి హనుమకొండ మండలం కాజీపేటలోని ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ)కు నాయకత్వం వహిస్తూ ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. కీలక దాడులకు ఆశన్న వ్యూహకర్త. దండకారణ్య సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా రూపేశ్ పేరుతో వ్యవహరించిన ఆశన్న.. ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డిలపై బాంబులు పేల్చి హత్యాయత్నం, 1999లో ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర హత్య, 2000లో నాటి హోంమంత్రి మాధవరెడ్డి హత్య లాంటి ఘటనలకు నేతృత్వం వహించినట్లు చెబుతారు.

# ఆస్తులు అమ్ముకుని కాంగ్రెస్‌ను కాపాడా

- అయినా తనను పక్కన పెడుతున్న పార్టీ
- మరోమారు అక్కసు వెళ్లగక్కిన రాజగోపాల్



**నల్లగొండ, అక్టోబర్ 17 :** మంత్రి పదవి దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంతపార్టీపై మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌ను కాపాడేందుకు తన ఆస్తులు అమ్ముకున్నానని, కానీ పార్టీ తనను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన నలుగురికి మంత్రి పదవులు ఇచ్చారని, తనతోపాటు బీజేపీ నుంచి వచ్చిన వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి, అతని కుమారుడికి ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. తనను మాత్రం పక్కన పెట్టారని మండిపడ్డారు. పార్టీ కోసం ఆస్తులు అమ్ముకుని కష్టపడిన నన్ను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చి తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు మంత్రి పదవి రాకుండా కొందరు నాయకులు అడ్డుకుంటున్నారని చెప్పారు. ఎక్సైజ్ నిబంధనలకు తోడు నియోజకవర్గ ఎమ్మెల్యే సొంత నిబంధనలు ఖరారు చేయడం మునుగోడు నియోజకవర్గంలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిబంధనల పేరుతో జారీ చేసిన అంశాలపై సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. దీనిపై ఆయన స్పందిస్తూ కేవలం ప్రజలకు మేలు చేసేందుకే అని అన్నారు. నియోజకవర్గంలోని మునుగోడు, చండూరు, గట్టుప్పల్, నాంపల్లి, మర్రిగూడ, నాంపల్లి, చౌటుప్పల్, సంస్థన్ నారాయణపురం మండలాలలో వైన్ షాప్స్ టెండర్స్ వేసే ఆశావహులు టెండర్లు వేయాలంటే షరతులు పాటించాలని హుకుం జారీ చేశారు. షరతులు పాటించని వారు టెండర్స్ వేయవద్దని,వైన్ షాప్స్ నిర్వాహకులు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మద్యం అమ్మాలని సూచించారు . మండలానికి చెందిన స్థానికులు మాత్రమే టెండర్లు వేయాలని, ఇతర మండలానికి చెందిన వ్యక్తులు టెండర్లు వేయవద్దని స్పష్టం చేశారు. వైన్ షాప్‌లు ఊరి బయట మాత్రమే పెట్టాలని,వైన్ షాప్ కు అనుబంధంగా పర్మిట్ రూమ్ ఉండవద్దన్నారు. ముఖ్యంగా బెల్ట్ షాపులకు మద్యం అమ్మవద్దని , లాటరీ విధానంలో వైన్స్ షాప్‌లు దక్కించుకున్న ఓనర్స్ సిండికేట్ కాకూడదని పేర్కొన్నారు.ఈ రూల్స్ రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీతో సంబంధం లేదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, బెల్టు షాప్‌ల నిర్మూలన, మహిళల సాధికారతే తన ఉద్దేశమని పేర్కొన్నారు.

# 'లండన్‌లో మీ అబ్బాయికి ప్రమాదం..'

## రూ.35 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు



**హైదరాబాద్:** లండన్‌లో మీ కుమారుడికి ప్రమాదం జరిగిందని నమ్మించి సైబర్ నేరగాళ్లు రూ.35లక్షలు కాజేసిన ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన 61 ఏళ్ల వృద్ధురాలికి వాట్సప్ కాల్ చేసిన వ్యక్తి.. తన పేరు స్టీవ్ అని, లండన్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నాని పరిచయం చేసుకున్నాడు. లండన్ ఎయిర్ పోర్టులో మీ కుమారుడికి ప్రమాదం జరిగింది, తలకు బలమైన గాయాలయ్యాయని చెప్పాడు. లగేజీ మిస్ అవ్వడంతో ఎలాంటి ఐడెంటిటీ లేదని, ఆసుపత్రిలో చేర్చుకోవటం లేదని నమ్మించాడు. ఎలాగైనా తన కుమారుడికి చికిత్స అందించాలని ప్రాథేయపడిన వృద్ధురాలు.. విడతల వారీగా చికిత్స కోసం రూ.35.23 లక్షలు పంపించింది. తన కుమారుడు ఎలా ఉన్నాడో చూసేందుకు ఫొటో, వీడియో పంపించాలని కోరగా.. కాల్ చేసిన వ్యక్తి అందుకు నిరాకరించాడు. అనుమానం వచ్చిన బాధితురాలు కుమారుడిని కాంటాక్టు చేసింది. తాను క్షేమంగా ఉన్నానని, ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన వృద్ధురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.



## ప్రజా పోరాట నాయకుడు కర్నాటి కృష్ణయ్య

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఖమ్మం తొలి శాసన సభ్యులు, నిస్వార్థ కమ్యూనిస్ట్ యోధుడు, ప్రజా పోరాట నాయకుడు, కొందరు చనిపోయిన ప్రజల మనసుల్లో ఉంటారు అలాంటి మహానుభావులలో కామ్రేడ్ కర్నాటి కృష్ణయ్య ముందు వరుసలో ఉంటారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రము లోని సిపిఐ కార్యాలయం వద్ద కర్నాటి కృష్ణయ్య 27వ వర్ధంతి సభ ను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత కర్నాటి కృష్ణయ్య స్థూపం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించి, పార్టీ అరుణ పతాకాన్ని రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు, ఖమ్మం తొలి శాసన సభ్యులు గా పోటీ చేసినా కృష్ణయ్య పై ఆరుగురికి డిపాజిట్లు కూడా దక్కలేదు అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు , సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు, మచ్చా రఘుపతిరావు, మచ్చా రేణుక, కర్నాటి రవీందర్, కర్నాటి నళిని రాణి బీఆర్ఎస్ మండలం అధ్యక్షుడు వున్నాం బ్రహ్మయ్య, నాగు బండి శ్రీనివాసరావు, కోటి సైదిరెడ్డి, మరికంటి రేణుబాబు,సిపిఎం మండల కార్యదర్శి కె.వి. రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చ నరసింహారావు, యడ్ల తిరుపతిరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బంద్‌కి ఆమ్ ఆద్మీ పార్టీకి పూర్తి మద్దతు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తెలంగాణా లో రేపు తల పెట్టిన బిసి 42% రిజర్వేషన్ కు మద్దతు గా ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కమిటీ పూర్తి మద్దతు ప్రకటించింది. బిసి నాయకులతో సమావేశంలో రాష్ట్ర నాయకులు బంద్ కు పూర్తి మద్దతు పార్టీ నుండి ఉంటుంది అని తెలిపారు. ఖమ్మం జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు స్వర్ణసుబ్బారావు, పసుమర్తి శ్రీనివాస్ రేపటి బంధు కు కార్యకర్తలు, బంద్ లో పాల్గొని అభిమానులు బంద్ ను విజయవంతం చేయాలి అని పిలుపు నిచ్చారు



## శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప స్వాములు

**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి పట్టణం నుండి శబరిమలై అయ్యప్ప స్వామి సన్నిధానం వరకు పాదయాత్రగా పట్టణానికి చెందిన అయ్యప్ప మాలధార భక్తులు శుక్రవారం రోజు బయలుదేరారు. అంతకు ముందు శంకర్ పల్లి విఠలేశ్వర ఆంజనేయ దేవాలయం నుండి శోభాయాత్ర అయ్యప్ప స్వామి దేవాలయం వరకు నిర్వహించారు. గురు స్వాములు దండు మోహన్ తదితరులు వీరికి అయ్యప్ప స్వామి దేవాలయం నుండి వీడ్కోలు పలికారు. ఈ పాదయాత్రలో విక్రాంత్ సోను స్వామి, బాబి స్వామి, బొబ్బి స్వామి, భాస్కర్ రెడ్డి, శ్రీకర్ స్వామి తదితర అయ్యప్ప మాలధార స్వాములు శబరిమల సన్నిధానంకు తరలి వెళ్లారు.

### కామారెడ్డి కాంగ్రెస్ పార్టీజిల్లా అధ్యక్ష పదవి

## పండ్ల రాజుకు దక్కేనా?



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కాంగ్రెస్ పార్టీలో 1986 లో కార్యకర్తగా ప్రస్థానం మొదలు పెట్టి విద్యార్థి సంఘం ఎన్ ఎస్ ఎన్ ఎస్ యు ఐ జనరల్ సెక్రటరీగా ఎన్నికై రాజకీయ జీవితం మొదలుపెట్టాడు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగటం అతని వ్యక్తిత్వానికి నిదర్శనం. పార్టీ ఏ పని అప్పచెప్పిన నీబద్ధత చేయటం అతనికి చెల్లింది. కరోనా సమయంలో సైతం తన సొంత డబ్బులతో పాత బస్టాండ్ ,రైల్వే స్టేషన్ ,నేషనల్ హైవేపై వాహనదారులకు తన వంతుగా అన్నం మంచినీటి సరఫరా చేసి తనలోని మంచితనాన్నిచాటుకున్నాడు. కాంగ్రెస్ పార్టీలో 1986లో మొదలైన తన రాజకీయ జీవితం ఇప్పటివరకు ఏ ఇతర పార్టీలోకి వెళ్లకుండా ఉండటం పార్టీ పట్ల అతనికి ఉన్న విధేయతను తెలియజేస్తుంది. 1990 నుండి 1995 వరకు పాటు యువజన సంఘం జనరల్ సెక్రెటరీగా, 1996 నుండి 2006 వరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం టౌన్ ప్రెసిడెంట్ గా, తెలంగాణ ఉద్యమ కాలంలో 2012 నుంచి 2015 వరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ స్పోక్స్ మెన్ గా, ఇలా అంచలంచెలుగా పార్టీ అప్పచెప్పిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉమ్మడి రాష్ట్రంలో సదాశివనగరం మండలం ఎంపీపీ గా ఐదు సంవత్సరాలు పాటు ప్రజలకు సేవ చేయటం అదే నాయకత్వ లక్షణాన్ని చూడవచ్చు. ఇలా పార్టీలో ఇన్ని సంవత్సరాలుగా పార్టీ మారకుండా పార్టీ అప్పు చెప్పిన పనిని సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ జిల్లా టౌన్ ప్రెసిడెంట్ గా, కొనసాగుతున్న పండ్ల రాజు జిల్లా అధ్యక్ష పదవిని ఆశించడంలో ఎలాంటి తప్పులేదని కార్యకర్తలు మాట్లాడుకోవడం విశేషం. ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ భూదాన్ పోచంపల్లి నుండి పాదయాత్ర చేసినప్పుడు రామాయంపేట నుండి సిర్నాపల్లి వరకు పాదయాత్రలో నేను సైతం అని పాల్గొనడం అతనికి పార్టీ పట్ల పార్టీలోని పెద్దలపట్ల అతనికి ఉన్న విధేయతను రుజువు చేసుకున్నాడు. బీసీ బిడ్డ గంగపుత్రుడు మరి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని ఇస్తుందా వేచి చూడాల్సిందే. ప్రజలు కార్యకర్తలు మాత్రం పండ్ల రాజుకు జిల్లా అధ్యక్ష పదవి ఇస్తే ప్రజల్లోకి పార్టీని మరింతగా తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేస్తాడని చర్చించుకోవడం చెప్పుకోదగ్గ విషయం. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీ నినాదం బలంగా గ్రామాలకు విస్తరించిన వేళ. ఎలాగూ స్థానిక ఎన్నికలు వాయిదా పడ్డాయి ఇప్పుడైనా కాంగ్రెస్ పార్టీ గ్రూపు రాజకీయాలు పక్కనపెట్టి ఇట్లాంటి నిజమైన కాంగ్రెస్ వాదికి జిల్లా అధ్యక్ష పదవి ఇస్తే బీసీ ప్రజలు తప్పకుండా ఊరట చందే అవకాశం ఉంది. ఏది ఏమైనా సుదీర్ఘ కాలం 40 సంవత్సరాల నుండి ఒక బీసీ బిడ్డ గంగ పుత్రుడు కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన వ్యక్తికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఇచ్చి అతని సేవలు మరింతగా నియోగించుకుంటుందని బీసీ ప్రజల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న నిజాయితీని నిరూపించుకుంటుందని జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## చందానగర్‌లో బిసి జేఏసీ ఆందోళన

- రిజర్వేషన్ల వ్యతిరేకులకు సద్బుద్ధి ప్రసాదించాలని అంబేద్కర్ కు వినతి
- బంద్ ఫర్ జస్టిస్' ను విజయవంతం చేయాలని సబ్బండ వర్గాలకు బిసి జేఏసీ పిలుపు



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** తెలంగాణలో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిసి జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శేరిలింగంపల్లి బిసి జెఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చందానగర్ లోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బిసి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బిసి రిజర్వేషన్లను అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్న వ్యతిరేక శక్తులకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రాన్ని జేఏసీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి తెలంగాణ జేఏసీ మాజీ చైర్మన్, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కో చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, తెలంగాణ బిసి కుల సంఘాల జేఏసీ కన్వీనర్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, జేఏసీ నాయకులు తుడి ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్ లు మాట్లాడుతూ.. దేశంలో స్వతంత్రం వచ్చిన నాటినుంచి నేటి వరకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేవలం బిసి లకు మాత్రమే లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బిసి లకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్య, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తరువాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 18 వ తేదీన బంద్ ఫర్ జస్టిస్ పేరుతో తలపెట్టిన తెలంగాణ బంద్ ను సంపూర్ణంగా విజయవంతం చేయాలని అన్ని వర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కె సాయన్న ముదిరాజ్, బీసీ జేఏసీ నాయకులు ఉప్పల ఏకాంత్ గౌడ్, సగర సంఘం రాష్ట్ర సలహాదారులు కెపి. రామ్ సగర, సగర సంఘం గ్రేటర్ అధ్యక్షుడు మోడల రవి సగర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక శ్రీనివాస్ సగర, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గంగాధర్ సగర, జేఏసీ నాయకులు జిల్ల గణేష్, సీతారాం సగర, రామకృష్ణ సగర, అశోక్ యాదవ్, నరసింహ, శంకర్ ముదిరాజ్, బాలరాజు సగర, నారాయణ రావు, శివశంకర్, ఆంజనేయులు సగర, చింతకింది రవీందర్ గౌడ్, కుమార్ యాదవ్, చెన్నం రాజు ముదిరాజ్, చందు సగర, శివ సగర, రాము, తిరుమలేష్, అడ్వకేట్ రమేష్, అంజమ్మ, మాధవి, బిక్షపతి, వెంకట నర్సింహా రావు, రమేష్ గౌడ్, రాజు ముదిరాజ్, మధుకుమార్, పెద్ద సంఖ్యలో బీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు,

## "న్యూ షాప్ "కెఫేను ప్రారంభించినకొమిరిశెట్టి సాయిబాబా



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ మెట్రో స్టేషన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన "న్యూ షాప్ " కెఫే ను ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించిన శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా కార్యక్రమం లో నిర్వాహకులు సాయిబాబా ని శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో నిర్వాహకులు గౌతమ్, ఫణి, భవాని ప్రసాద్ రెడ్డి నాయకులు భాస్కర్, రమేష్ గౌడ్, మధు కుమార్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## బీసీ జేఏసీ బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

### యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌరారపు సర్వేశ్వరరావు



**వాజేడు,రాజముద్ర న్యూస్:** బీసీ సంఘాల జేఏసీ బంద్ కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని,యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గౌరారపు సర్వేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలో కులగనన సర్వేల ఆద్యుడు రాహుల్ గాంధీ, రాష్ట్ర అధ్యక్షులు మహేష్ గౌడ్,ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ కు కట్టుబడి ఉన్నారని, ఆయన పునరుద్ఘరించారు. బీసీ రిజర్వేషన్లపై ఎట్టి పరిస్థితుల్లో వెనకడుగు వేసే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు.బీసీ సంఘాల జేఏసీ బంద్ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కనువిప్పు కలగాలని, బీసీ జేఏసీ బంద్ కు వాజేడు మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అందరు మద్దతుగా నిలవాలని ఆదేశించారు.

## విద్యార్థుల క్రీడా అభివృద్ధికి ఎస్పీఆర్ ఫౌండేషన్ చేయూత

- క్రీడల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలకు కృషి
- ఎస్పిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సూర్యప్రసాద్



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** విద్యార్థులలో క్రీడాస్ఫూర్తి, శారీరక దృఢత్వం, నాయకత్వ నైపుణ్యాల పెంపునకు క్రీడలు కీలకమని ఎస్ పి ఆర్ చేయూత ఫౌండేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, జర్నలిస్ట్, ప్రజా దర్బార్ తెలుగు దినపత్రిక చేవెళ్ల నియోజక వర్గ ఇన్‌చార్జి దుంపల సూర్య ప్రసాద్ (రాజు) అన్నారు. శుక్రవారం చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల క్రీడా అభిరుచిని ప్రోత్సహించే లక్ష్యంతో.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెన్నిస్ బ్యాట్లు, బ్యాడ్మింటన్ నెట్లు, వాలీబాల్స్, బాల్ నెట్లు వంటి పలు క్రీడా సామగ్రిని కళాశాల ప్రిన్సిపాల్ కాంచన లతకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దుంపల సూర్యప్రసాద్ మాట్లాడుతూ... క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు. యువత అభివృద్ధికి ఎస్పీఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ చేయూతగా ఉంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ కాంచన లత మాట్లాడుతూ... కళాశాలకు అందజేసిన క్రీడా సామగ్రి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంపొందిస్తుందన్నారు. క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తూ ఎస్పీఆర్ ఫౌండేషన్ చేసిన ఈ చేయూత ఎంతో విలువైనదని అభినందించారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త కె దయాకర్, ఉపాధ్యాయులు దామోదర్, జామలుద్దీన్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఎస్పీఆర్ చేయూత ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలి

### ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డిపై, అలాగే కొంత మంది విలేకరులపై ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు,ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏపీలో నకిలీ మద్యం కుంభకోణాన్ని వరుస కథనాలతో బయటపెట్టిన సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి,కొంత మంది సాక్షి విలేకరులపై ఏపీ పోలీసులు కక్ష సాధింపు చర్యలను వ్యతిరేకిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాణిజ్యభవన్ సెంటర్‌లో నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి పై అక్రమ కేసులు ఎత్తివేసి,పత్రిక స్వేచ్ఛను కాపాడాలి డిమాండ్ చేశారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తున్న పత్రికలపై ఇలాంటి తప్పుడు కేసులు పెడితే గతంలో ఎన్నో ప్రభుత్వాలు కూలిపోయాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి సాక్షి దినపత్రికపై కక్ష కట్టి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో ఎడిటర్ ఛాంబర్‌లోకి సోదాల పేరుతో ఏపి పోలీసులు ప్రవేశించి హల్‌చల్ చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు, ప్రజాసంఘాల నాయకులు వజ్జె వీరయ్య యాదవ్,ఐతగాని రాంబాబుగౌడ్,బంటు కృష్ణ, కందుకూరి యాదగిరి,బుక్క రాంబాబు,పెద్దింటి శ్యామ్‌సుందర్‌రెడ్డి, మట్టిపల్లి సైదులు,బొమ్మిడి లక్ష్మినారాయణ, యాతాకుల రాజయ్య మదిగ, చింతలపాటి చినశ్రీరాములు, ఎర్ర అఖిల్,నరసింహరావు,లచ్చయ్య, పక్కీరు సైదిరెడ్డి,వల్లబట్ల రవి, ఎరుకుల సైదులు,బొడ్డు నాగరాజు,వేములకొండ జానయ్య, అనమాల యాకయ్య, తండు వెంకన్నగౌడ్,జలగం మల్లేష్, తండు సైదులుగౌడ్, మాదగాని వేణు,జలగం మధు, చెవగాని నాగరాజు,రెబ్బ విజయ్, గునగంటి అంజి,రషీద్, శరత్, కొండ శ్రీను,వాసా శేఖర్,ప్రసాద్, బాలు,శంకర్ పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిస్థితిని సమీక్షించిన అనంతరం కలెక్టర్ స్వయంగా 10 వ తరగతి విద్యార్థులకు సోలార్ సిస్టమ్ పై పాఠం బోధించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాజు,ఎమ్మార్వో సునీత, ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి ,ఎం.ఈ.ఓ గంగారెడ్డి , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ బందుకు మద్దతు

### తెలంగాణ రాష్ట్ర ఓడబలి సేవా సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షులు దర్ర దామోదర్

**వాజేడు, రాజముద్ర న్యూస్:** స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు నేడు తెలంగాణ రాష్ట్ర బీసీ బందును విజయవంతం చేయాలని ఓడ బలిజ రాష్ట్ర అధ్యక్షులు దర్ర దామోదర్ పిలుపుమేరకు రిజర్వేషన్లలో బీసీఏ కులాల జాబితాలో 3వ కులం, బీసీ ఏ రిజర్వేషన్ కేటగిరీలో సీరియల్ నెంబర్ 3లో ఓడ బలిజ కులస్తులు అత్యధిక జనాభా కలిగి ఉన్నారని అన్నారు. బీసీలందరికీ రావలసిన 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల చట్ట సభల్లో అమలు చేయాలనీ,బీసీలకు రావాల్సిన వాటా వచ్చేంతవరకు పోరాటాలు, ఉద్యమాలు, రాస్తారోకలు,నిర్వహించి ఖచ్చితంగా సాధించుకుంటామని అన్నారు. శాంతియుతంగా ప్రతి మండల కేంద్రంలో ఉన్న విద్యాలయాలు, ఆఫీసులు, వాణిజ్య వ్యాపార సంస్థలు, ఆర్టీసీ బస్సులు లారీలు, ఇతర వాహనాలు, రోడ్లపై తిరగకుండా సంపూర్ణ మద్దతుకు సహకరించాలని ప్రశాంత వాతావరణంలో బందును విజయవంతం చేయాలనీ, అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయని అన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్నటువంటి కాపు,బెస్త, కుమ్మరి, రజక,నాయి బ్రాహ్మణ,కంసాలి పెరిక, వడ్డెర, గౌడ,పద్మశాలి, మైనారిటీ, మొదలగు బీసీ కులాలను కలుపుకుని తెలంగాణ రాష్ట్ర బందును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన భీమ్ భరత్

### ధన్యవాదాలు తెలిపిన అజీజ్ నగర్ పద్మావతి కాలనీ వాసులు

**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** మొయినాబాద్ మండలం అజీజ్ నగర్ గ్రామ పరిధిలోని పద్మావతి కాలనీలో తరచుగా విద్యుత్ కొరత సమస్య ఉన్నందున కాలనీ వాసులు ఇటీవల భీమ్ భరత్ ను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ ఈ సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. శుక్రవారం రోజు విద్యుత్ అధికారులు పద్మావతి కాలనీలో కొత్తగా 100కెవి ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేసి నూతన కనెక్షన్ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి గూడ సంజీవ రెడ్డి, బాల్ రెడ్డి, జగన్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, కృష్ణ రెడ్డి, రాజి రెడ్డి, షాబాద్ మండల పి ఏ సి ఎస్ వైస్ చైర్మన్ మద్దూరు మల్లేష్ , తాళ్ళపల్లి బాలరాజ్, కాలనీ వాసులు ఈ విషయంలో స్పందించి సమస్య పరిష్కరించినందుకు భీమ్ భరత్ అభినందిస్తూ శాలువ తో ఘనంగా సత్కరిస్తూ హర్షం వ్యక్తం చేశారు.




## ఘనంగా నూతన వస్త్ర బహుకరణ

- వికాస తరంగిణి సేవలు అమోఘం
- ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** దీపావళి రోజు చిన్న జీయర్ స్వామి వారి పుట్టినరోజును పురస్కరించుకొని సూర్యాపేట వికాస తరంగిణి శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే బీదలకు నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమంలో డాక్టర్ రామ్మూర్తి యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు గత 15 సంవత్సరాలుగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో వికాస తరంగిణి జిల్లా బాధ్యులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాల ఆచార్యుల నిర్వహణలో శుక్రవారం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సుమారు 800 మంది నిజమైన బీదలకు నూతన వస్త్రాలు అందించడం తనకు ఎంతో ఆనందాన్ని కలగజేస్తున్నదని ఇంత గొప్ప సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వికాస తరంగిణి శాఖ వారికి నా అండ తప్పకుండా ఉంటది అని అలాగే వారి ఆధ్వర్యంలో బీదలకు ఒక మంచి మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని ఈ సందర్భంగా రామ్మూర్తి వికాస తరంగిణి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వేణుగోపాల స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు మురళీధరాచార్యులు ఊర గాయత్రి,డాక్టర్ ప్రశాంతి,వికాస తరంగిణి భక్తులు బజ్జూరి కృష్ణయ్య గజ్జల రవీందర్ మంజుల జ్ఞానకుమారి అరుణ పద్మ సుభాషిని కవిత ఉమా జ్యోతి శోభ వల్లీకుమారి సుమాల ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## కృష్ణాపురంలో వైద్య శిబిరం

**వాజేడు, రాజముద్ర న్యూస్ :** మండల కేంద్రంలో కృష్ణాపురం గ్రామంలో ప్రాథమిక వైద్యాధికారి యోషిత,ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగు మందులు అందజేశారు. పోషకాలు కలిగి ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల తల్లి బిడ్డ క్షేమంగా ఉంటుందని గర్భిణీ స్త్రీలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ అనూష, ఏఎన్ఎం సుమలత, ఆశ కార్య కార్తలు పాల్గొన్నారు.

## బీసీల బందుకు పూర్తి మద్దతు

### యాదవ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లగా రమేష్



**వాజేడు, రాజముద్ర న్యూస్:** నేడు తలపెట్టిన బీసీ సంఘాల రాష్ట్ర బంద్ కు ములుగు జిల్లా యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ రిజర్వేషన్ 42 శాతం ఇంప్లిమెంటేషన్ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు నేడు తలపెట్టిన బందుకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ యాదవ సంఘం నాయకులంతా బందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ములుగు జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్నటువంటి యాదవ సంఘం నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతనికి కృషి చేయాలని ఆయన అన్నారు.



## సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలి

### వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** సిఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ఆదేశించారు. శుక్రవారం ధన్నారంలోని శ్రీ వెంకటరమణ రైస్ మిల్లును సందర్శించిన అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ రబీ 2024-25 కి సంబంధించిన సిఎంఆర్ డెలివరీల విషయంలో ఎలాంటి అలసత్వం వహించకుండా డెలివరీల ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లు యజమానికి సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ తో పాటు పౌరసరఫరాల జిల్లా అధికారి మోహన్ కృష్ణ ఉన్నారు.

## మహిళలు, బాలికలకు భద్రతలో అత్యంత ప్రాధాన్యత

### నేర నియంత్రణలో సీసీటీవీల కీలకం : ఎస్పీ కె.నారాయణ రెడ్డి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** మహిళలకు, బాలికలకు భద్రతలో అత్యంత కీలకమని వికారాబాద్ జిల్లా ఎస్పీ కె నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమీక్షలో ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై దృష్టి సారించారు. పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, విచారణను వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జారీ అయిన నాన్-బెయిలబుల్ వారెంట్ల ( ఎన్ వి డబ్ల్యూ లు) అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచి వారిని నియంత్రించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలకు గల కారణాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్న హాట్‌స్పాట్‌లలో నివారణ చర్యలు తీసుకోవాలని, ప్రజలలో అవగాహన కల్పించడానికి కళాజాత బృందాల ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, బాలికలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అటువంటి అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ఎటువంటి జాప్యం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే వారి నేర చరిత్రను పూర్తిగా పరిశీలించి రౌడీ షీట్‌లు తెరవాలని, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడానికి రికార్డులను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమాజంలో మహిళలు, బాలికలకు పూర్తి భద్రత కల్పించడం పోలీసుల ప్రాథమిక బాధ్యత అని ఆయన తెలిపారు . ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలన కొరకు కష్టపడి పని చేయాలని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర చాలా కీలకమని ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. ప్రజలలో సీసీటీవీల ఏర్పాటుపై అవగాహన కల్పించాలని, వాటి ప్రాముఖ్యతను వివరించాలని కోరారు. ఇసుక అక్రమ రవాణా, గుట్కా విక్రయాలు, పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారాంతపు రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ఓపెన్ డ్రింకింగ్ నివారణ, వాహనాల తనిఖీలను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఇ-పెట్టీ కేసులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని కేసుల కన్విక్షన్ శాతాన్ని పెంచాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా ఎస్పీ ఇటీవల కేసులలో కన్వెన్షన్ రావడానికి సహకరించిన కొడంగల్ కోర్ట్ ఏ పి పి ఓ అధికారి వి.అభినై, వికారాబాద్ ఏ జె ఎఫ్ సి ఎం కోర్ట్ అధికారిని ఏపీపీ సమీనా బేగం, పోలీస్ అధికారులు ఉమెన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సరోజా, కొడంగల్, పిఎస్, ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ, నవాబుపేట్ పిఎస్ ఎస్‌హెచ్‌ఓ పుండ్లిక్, కోర్ట్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, కోర్ట్ కానిస్టేబుల్ అధికారులకు శాలువాతో సత్కరించి, మేమంటోలు అందించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, వికారాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ డిఎస్‌పి బాల కృష్ణ రెడ్డి, పరిగి డిఎస్‌పి శ్రీనివాస్, డీటీసీ డి.ఎస్.పి శ్రీనివాసులు, అధికారులు, డి సి ఆర్ బి డి.ఎస్.పి జానయ్య, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆ గ్రీన్ కార్డ్ లాటరీలో 2028 వరకు

## భారతీయులకు నోఛాన్స్

**వాషింగ్టన్:** ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటినుంచి అమెరికా వీసా నిబంధనలను మరింత కఠినతరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారతీయులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలో పాల్గొనేందుకు భారతీయులకు 2028 వరకు అవకాశం లభించదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రీన్ కార్డ్ లాటరీ కార్యక్రమంలో గత ఐదేళ్లలో అమెరికాకు తక్కువ వలసలు ఉన్న దేశాల దరఖాస్తుదారులను ఎంచుకుంటున్నట్లు తెలిపాయి. ఏటా 50 వేల మంది లోపు అమెరికాకు వలసవచ్చే దేశాలకే అవకాశం ఇస్తున్నట్లు సమాచారం. అమెరికాలో అన్ని దేశాలకు చెందిన వలసదారులకు అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీసా లాటరీలో పాల్గొనడానికి అనుమతి ఉన్న దేశాలకు తాజా వీసా కేటాయింపులను ప్రకటించారు.

గత కొన్నేళ్లుగా భారత్ నుంచి అమెరికాకు అధికంగా వలసలు ఉండడంతో భారతీయులకు ఈ వీసా కార్యక్రమానికి కావాల్సిన అర్హత పరిమితి మించిపోయిందని.. అందువల్లే ఈ లాటరీలో పాల్గొనడానికి వారికి అవకాశం ఇవ్వట్లేదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో, 93,450 మంది భారతీయులు అమెరికాకు వలస రాగా.. 2022లో ఈ సంఖ్య 1,27,010గా ఉంది. ఇది అమెరికాకు వస్తున్న దక్షిణ అమెరికన్ (99,030), ఆఫ్రికన్ (89,570), యూరోపియన్ (75,610) వలసదారుల సంఖ్య కంటే ఎక్కువ. 2023లో 78,070 మంది భారతీయులు అమెరికాకు వలస వచ్చారు. ఈ రికార్డుల ఆధారంగా 2028 వరకు భారతీయులను యూఎస్ డైవర్సిటీ వీసా లాటరీలకు అనర్హులుగా నిర్ణయించినట్లు తెలిపింది. ఇప్పటికే ఇమిగ్రేషన్ విధానంలో అమెరికా తీసుకుంటున్న కఠిన చర్యలతో సమస్యలు ఎదుర్కొంటున్న భారతీయులకు ఇది మరో ఎదురుదెబ్బగా మారింది. ఈ లాటరీకి 2026 వరకు అర్హత సాధించని ఇతర దేశాల్లో చైనా, దక్షిణ కొరియా, కెనడా, పాకిస్థాన్ ఉన్నాయి.




### వలసదారుల పెరోల్ ఫీజు 1,000 డాలర్లు..

పెరోల్ ఫీజుపై అమెరికా సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో కొన్నిరకాల వలసదారులకు అవసరమయ్యే పెరోల్ ఫీజును 1,000 డాలర్లకు పెంచుతున్నట్లు ప్రకటించింది. వీసా లేదా ఇతర అధికారిక పత్రాలు లేకుండా అమెరికాలో ప్రవేశించడానికి, ఉండటానికి పెరోల్ అనేది తాత్కాలిక అనుమతి. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే దీనిపై విదేశీయులను అమెరికాలోకి అనుమతిస్తారు. ఇటీవల ట్రంప్ ప్రవేశపెట్టిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లులో ఈ పెరోల్ ఫీజును తప్పనిసరి చేశారు. ప్రస్తుతం దీని ఆధారంగా అమెరికాలోకి ప్రవేశించాలంటే విదేశీయులు 1,000 డాలర్ల పెరోల్ రుసుమును చెల్లించాలి. వీటిలో ప్రారంభ పెరోల్, రీ-పెరోల్, పెరోల్ ఇన్ ప్లేస్ లేదా డీహెచ్ఎస్ కస్టడీ నుంచి పెరోల్ వంటివి ఉంటాయి. ఈ రుసుము ఇప్పటికే ఉన్న ఏదైనా ఇతర ఇమిగ్రేషన్ సర్వీస్ ఫైలింగ్ లేదా బయోమెట్రిక్ రుసుముకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇమిగ్రేషన్ అధికారులు సూచించిన సమయం లోపు ఈ రుసుమును చెల్లిస్తేనే పెరోల్ పొందడానికి అనుమతినిస్తారు.

## హెచ్-1బీ వీసాల ఫీజు పెంపు..

### కోర్టులో సవాల్ చేసిన అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్

**యూఎస్ :** హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ న్యాయస్థానంలో సవాల్ చేసింది. 3 లక్షల మంది వ్యాపారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రంప్ అధ్యక్షుడిగా పదవీకాలం చేపట్టిన తర్వాత ఆయనపై వేసిన మొదటి దావా ఇది. రాయిటర్స్ ప్రకారం.. హెచ్-1బీ వీసా రుసుమును పెంచుతూ సెప్టెంబరులో ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఆయన అధికార పరిధిని మించిందని ఆ గ్రూప్ డీసీలో ఫెడరల్ కోర్టులో దాఖలు చేసిన దావాలో పేర్కొంది. కాంగ్రెస్ తీసుకొచ్చిన సంక్లిష్టమైన వీసా వ్యవస్థను ఇది దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తంచేసింది. హెచ్-1బీపై ఆధారపడిన వ్యాపారులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందని ఆ గ్రూప్ వాదించింది. వ్యాపారులు తమ కార్మిక వ్యయాలను పెంచుకోవడం లేదా తక్కువ నైపుణ్యం కలిగినవారిని నియమించుకోవాల్సిన పరిస్థితి వస్తోందని గుర్తించింది. 'అమెరికా ఛాంబర్‌లోని అనేకమంది సభ్యులు హెచ్-1బీ ఉద్యోగులను బలవంతంగా తగ్గించుకొనే పరిస్థితి ఏర్పడింది. ఇది వారి పెట్టుబడిదారులతో పాటు కస్టమర్‌లు, సొంత ఉద్యోగులపైనా తీవ్ర ప్రభావం ఉంటుంది' అని వెల్లడించింది. ఇక, హెచ్-1బీ వీసా ఫీజు పెంపును వ్యతిరేకిస్తూ.. ఇప్పటికే పలు ఉద్యోగ సంఘాలు కోర్టులను




ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా ట్రంప్ నిర్ణయాన్ని సవాల్ చేయడం గమనార్హం. ఇటీవల ట్రంప్ ప్రకటించిన వీసా ఫీజు పెంపు నిర్ణయం అందరినీ భయాందోళనకు గురిచేసింది. అయితే, హెచ్-1బీ వీసాపై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు అని వైట్‌హౌస్ ఆ తర్వాత స్పష్టతనిచ్చింది. ఇది ఈ వీసా కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికే అమలు చేస్తామని వెల్లడించింది. ప్రస్తుత వీసాదారులకు, రెన్యువల్‌కు వర్తించదని తేల్చిచెప్పింది.

## డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలు

### సుప్రీం ఆందోళన

**న్యూఢిల్లీ :** డిజిటల్ అరెస్టులు.. ఇటీవల సైబర్ నేరగాళ్లు ఎంచుకొన్న కొత్త పంథా ఇదే. దీని పేరు చెప్పి అవతలి వ్యక్తులను భయాందోళనకు గురిచేస్తూ.. పెద్ద మొత్తంలో సొమ్ములు కాజేస్తున్నారు. దేశంలో ఈ డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పుగా మారాయి. తాజాగా ఈ మోసాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సుమోటోగా తీసుకున్న ఓ కేసు విచారణ సందర్భంగా కేంద్రం, సీబీఐలకు వారి స్పందన తెలపాలని న్యాయస్థానం ఆదేశించింది. అసలేం జరిగిందంటే.. హరియాణాలోని అంబాలాకు చెందిన 73 ఏళ్ల ఓ మహిళ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కి ఫిర్యాదు పత్రం రాశారు. అందులో.. తనను డిజిటల్ అరెస్టు చేయమని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఉన్న ఒక పత్రాన్ని నేరగాళ్లు తనకు చూపించారన్నారు. రూ.కోటి ఇస్తే ఈ అరెస్టు నుంచి బయటపడొచ్చని వారు బెదిరింపులకు పాల్పడ్డారని ఆమె తెలిపారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లుగా నకిలీ పత్రాలు చూపించి నేరగాళ్లు సొమ్ములు కాజేయడాన్ని సీజేఐతో సహా సీనియర్ న్యాయమూర్తులు తీవ్రంగా పరిగణించారు. అంబాలా కేసును న్యాయస్థానం సుమోటోగా తీసుకోగా.. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులకు సంబంధించి నకిలీ సంతకాలు, సుప్రీం, హైకోర్టులు ఆదేశాలు జారీ చేసినట్లు పత్రాలు చూపించి ఇలాంటి నేరాలకు పాల్పడటం వల్ల న్యాయ



వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని ధర్మాసనం పేర్కొంది. వీటిని సాధారణమైన మోసాలుగా పరిగణించలేమని వ్యాఖ్యానించింది. ఇలాంటి నేరాలను బయటపెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసుల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయపడింది. ఇక, అంబాలా కేసుకు ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని అటార్నీ జనరల్‌ను, స్థానిక సైబర్ క్రైమ్ విభాగానికి సూచించింది. మరోవైపు ఇదే కేసుకు సంబంధించి స్పందన తెలియజేయాలని కేంద్రం, సీబీఐలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## సీతాఫలం కోసం ఏసీబీ వలలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌లు

**వికారాబాద్ రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పరిధిలోని పరిగి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసులో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. రంగారెడ్డి రేంజ్ జిల్లా ఏసీబీ డిఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సీతాఫల్ టెండర్ల పర్మిట్ల విషయంలో 40 వేలు లంచం తీసుకుంటూ కుల్కచర్ల సెక్షన్ ఆఫీసర్లు మొయినోద్దిన్, సాయికుమార్ రెడ్ హ్యాండేడ్ గా పట్టుబడ్డారు. కుల్కచర్ల రేంజ్ లో సీతాఫలాల తరలింపు కోసం గోపాల్ అనే వ్యక్తి 18 లక్షలకు టెండర్ చేజిక్కించుకున్నాడని సీతా ఫలాల తరలింపు పర్మిట్ల కోసం భాధితుడి వద్ద సెక్షన్ ఆఫీసర్లు 50 వేల రూపాయలు లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీ ని ఆశ్రయించాడని రంగారెడ్డి రేంజ్ జిల్లా ఏసీబీ డిఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. తను 40 వేలే ఇస్తానని బాధితుడు చెప్పగా ఫారెస్ట్ కారు డ్రైవర్ బాలక్రిష్ణ ద్వారా 40 వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండేడ్ గా పట్టుకున్నామని స్పష్టం చేశారు. ఇద్దరు సెక్షన్ ఆఫీసర్లతో




పాటు డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామన్నారూ.



### శబరిమల మహా పాదయాత్ర భక్తులకు ఘన స్వాగతం పలికిన

## గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** బిహెచ్ఇఎల్ అయ్యప్ప స్వామి దేవాలయం నుండి శబరిమల అయ్యప్ప దేవాలయం వరకు చేపట్టిన పాదయాత్ర బృందానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి గ్రామంలో గల శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో శుక్రవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి శాలువాలతో సన్మానించి, ఘన స్వాగతం పలికారు. అనంతరం రంగనాథ్ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ, బిహెచ్ఇఎల్ అయ్యప్ప స్వామి దేవాలయం నుండి శబరిమల వరకు పాదయాత్ర చేయడం అభినందనీయమని, శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ఈ పాదయాత్ర విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఏ ఆటంకం లేకుండా భక్తులు సురక్షితంగా తమ యాత్ర పూర్తి చేయాలని కోరారు. అనంతరం గోపనపల్లి తండాకు చెందిన సీనియర్ నాయకుడు అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద విందు ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది అయ్యప్ప స్వామి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం కాలినడకన శబరిమల బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బూచి రెడ్డి, ఎస్.ఎన్.రెడ్డి, శ్రీశైలం, కిరణ్, చారు, పాదయాత్ర భక్తులు, సీనియర్ నాయకులు, శేఖర్, సుమన్, శ్రీశైలం, స్థానిక నేతలు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం

**వాజేడు, రాజముద్ర న్యూస్ :** మండల కేంద్రంలో చంద్రుపట్ల, పెద్దగంగారం, టేకులగూడెం, గ్రామాల్లో త్రీఫేస్ లైను శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంటకు అంతరాయం కలుగుతుందని,మరమ్మతులు చేయడం జరుగుతుందని రైతులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

## పంటల వివరాలను నమోదు చేసుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్

**వాజేడు,రాజముద్ర న్యూస్ :** 2025 -26 సంవత్సరానికి ఖరీఫ్ సీజన్ సంబంధించిన పంటల నమోదు వివరాలను సంబంధిత క్లస్టర్ ఏఈఓ లు రైతుల వివరాలను నమోదు చేయటం జరుగుతుందని రైతుల యొక్క పంట నమోదు చేసిన వివరాలను విలేజ్ వాట్సప్ గ్రూపులలో పంపించడం జరుగుతుందని, ఒకవేళ ఎవరైనా రైతులు వారి యొక్క పంట వివరాలు తప్పుగా నమోదు అయినచో 25వ తేదీ లోపు సంబంధిత క్లస్టర్ ఏఈఓను సంప్రదించాలని, రైతు పంట నమోదు వివరాలు సరిగా లేనిచో వరి ధాన్యము పత్తి అమ్మే సమయంలో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తుందని,ఈ పంట నమోదు ఆధారంగానే వరి, ప్రత్తి పంటల కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఇబ్బంది పడకుండా ఏవైనా మార్పులు చేర్పులు ఉన్నచో, పోడు, ఖవులు చేసిన రైతులు కూడా వారి యొక్క వివరాలను సంబంధిత క్లస్టర్ ఏఈఓ ని సంప్రదించి వివరాలు నమోదు చేయించుకోగలరని అన్నారు.



## గవాయి పై దాడి చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలి

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** మహాజన నేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అక్టోబర్ నెల 6వ తారీఖున, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ బి.ఆర్. గవాయి పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎం ఆర్ పి ఎస్ నాయకులు శేరిలింగంపల్లి ఎం ఆర్ వో కి వినతిపత్రం అందజేయడం జరిగింది.. సుప్రీం కోర్ట్ ఛీఫ్ జస్టిస్ బి ఆర్ గవాయి పై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్ పై సుమోట గా కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలనీ ఎం ఆర్ పి ఎస్ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు ఐత రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ దాడి వెనుక వున్న శక్తులను బయటకు రావాలంట్టే ప్రజాస్వామ్య విలువులు కల్గి, సామాజిక న్యాయ దృక్పధం కల్గిన సుప్రీం కోర్ట్ మాజీ న్యాయమూర్తులతో కమిటీ వేసి విచారణ జరిపించాలని, భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకునేల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలి, ఎక్కడ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎం.ఆర్.పి.ఎస్ కన్వీనర్ కోడిచెర్ల ప్రేమ్ మాదిగ, జెగపతి అంజయ్య మాదిగ, వరలక్ష్మి మాదిగ, మదన్ మాదిగ, శేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## బీసీ బందుకు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధ సంఘాల జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు

### మహాజన సోషలిస్టు పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఆనంద్ మాదిగ

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** నేడు బిసి బందుకు మద్దతుగా ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి అనుబంధ సంఘాలు సంపూర్ణ మద్దతు ఇవ్వడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షులు పి ఆనంద్ అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని క్లబ్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... బీసీలకు ఇస్తామన్న 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైనవి అని ఎమ్మార్పీఎస్ సంపూర్ణంగా వారికి మద్దతుగా జరగబోయే బందులో పాల్గొంటామని తెలిపారు. బీసీలకు ఇస్తామన్న 42 శాతం రిజర్వేషన్ల పైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వాళ్ళ అధిష్టానాన్ని ఒప్పించి కేంద్ర ప్రభుత్వంలో ఉన్నటువంటి బీజేపీపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్లో బిల్లు పెట్టే విధంగా చొరవ తీసుకోవాలని రేవంత్ రెడ్డి కి డిమాండ్ చేస్తున్నాం అన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి భారతీయ జనతా పార్టీ నుంచి కేంద్ర మంత్రులుగా వ్యవహరిస్తున్న సీనియర్ నాయకులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు వారి పార్టీ వైఖరిని సత్వరమే తెలియజేసి అధికారంలో ఉన్నటువంటి పెద్దలపై ఒత్తిడి తెచ్చి అవసరమైతే అత్యవసర పార్లమెంటు సమావేశాలు నిర్వహించి బిల్లు పెట్టుటకై చొరవ తీసుకోవాలని రాష్ట్ర బిజెపి పెద్దలకు డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జగన్, మండల ఇంచార్జ్ శ్రీనివాస్, జిల్లా మహిళా నాయకురాలు పుష్ప రాణి, మండల మహిళా నాయకురాలు కేశేపల్లి సునీత, రాములు, బి హెచ్ పి ఎస్ నాయకులు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు యాదగిరి యాదవ్, లక్ష్మణ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నాయకులు మారుతి, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మణరావు ముదిరాజ్, టౌన్ అధ్యక్షులు బిఆర్ శేఖర్, నియోజకవర్గం అధ్యక్షులు పాల్గొన్నారు.

# గ్లోబల్ బ్రాండ్లలో టాప్ యాపిల్



ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీల్లో విలువ పరంగా యాపిల్ మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. మైక్రోసాఫ్ట్ రెండో స్థానంలో, అమెజాన్ మూడు, గూగుల్ నాలుగు, శాంసంగ్ ఐదో స్థానంలో ఉన్నాయి. సెమీకండక్టర్ తయారీ సంస్థ ఎన్విడియా గతేడాది 36వ స్థానంలో ఉండగా.. ఈసారి 15వ స్థానానికి చేరి వేగంగా పురోగతి సాధించిన గ్లోబల్ బ్రాండ్‌గా నిలిచింది. ఈ మేరకు ఇంటర్ బ్రాండ్స్ 'బెస్ట్ గ్లోబల్ బ్రాండ్స్' జాబితాను విడుదల చేసింది. ఏటా కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు, వినియోగదారుల కొనుగోలు నిర్ణయాలపై బ్రాండ్ ప్రభావం, పోటీ సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకొని ఈ ర్యాంకింగ్‌లను ఇస్తుంది. దక్షిణకొరియాకు చెందిన శాంసంగ్ వరుసగా ఆరో ఏడాదీ ఐదో స్థానంలో నిలిచింది. 2020 నుంచి ప్రపంచ టాప్–5 బ్రాండ్లలో ఉన్న ఏకైక ఆసియా కంపెనీగా గుర్తింపు పొందింది. టాప్–5 బ్రాండ్‌గా నిలవడంపై శాంసంగ్ మార్కెటింగ్ హెడ్ లీ వాన్–జిన్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ వినియోగదారులకు ఏఐ అనుభూతిని అందించే విధంగా నిరంతరం కొత్త ఆవిష్కరణలతో ముందుకు సాగుతామని చెప్పారు. కొరియాకు చెందిన మరో సంస్థ హ్యుందాయ్ మోటార్ 24.6 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో ఈ జాబితాలో 30వ స్థానంలో నిలిచింది. కొరియాకు చెందిన కంపెనీల్లో ఇది రెండోది. 2005లో తొలిసారి గ్లోబల్ టాప్–100 బ్రాండ్లలో స్థానం దక్కించుకున్న హ్యుందాయ్.. 2010 నుంచి క్రమంగా తన బ్రాండ్ విలువను పెంచుకుంటూ వస్తోంది. మరోవైపు కియా కూడా టాప్ 100 జాబితాలో చోటు దక్కించుకుని 89వ స్థానంలో నిలిచింది. జపాన్ కంపెనీల్లో టయోటా 6వ స్థానంలో, సోనీ 34, యూనిక్లో 47, నింటెండో 53వ స్థానంలో నిలిచాయి. చైనా కంపెనీల్లో షావోమి 81వ స్థానం, బీవైడీ 90, హువావే 96వ స్థానంలో ఉన్నాయి.






## ఆల్‌టైమ్ గరిష్ఠానికి బ్యాంక్ నిఫ్టీ

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. ఉదయం ఐటీ షేర్లలో అమ్మకాలతో స్వల్ప నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కార్పొరేట్ ఫలితాలు, విదేశీ మదుపర్ల పెట్టుబడుల రాక వంటి పాజిటివ్ అంశాలతో కాసేపటికే మళ్లీ పుంజుకొన్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 84,172 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకగా.. నిఫ్టీ కూడా 25,781.50 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని అందుకుంది. బ్యాంక్ నిఫ్టీ 57,828.30 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,331.78 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,467.66) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల్లోకి వచ్చిన సూచీ.. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. చివరికి 484.53 పాయింట్ల లాభంతో 83,952.19 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 124.55 పాయింట్ల లాభంతో 25,709.85 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.82గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీ ఎల్ టెక్నాలజీస్, ఎటెర్నల్, టెక్ మహీంద్రా, టాటా స్టీల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.46 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4338 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఆ ఇద్దరి సమక్షంలో గిల్ మరింత రాటుదేలుతాడు

### అక్షర్ పటేల్



మరో రెండు రోజుల్లో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ మొదలుకానుంది. తొలిసారి వన్డే సారథ్యం చేపట్టిన గిల్ జట్టును ఎలా నడిపిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. జట్టులో ఇద్దరు స్టార్లు ఉన్నారు. వారిలో ఒకరు విరాట్ కోహ్లి కాగా.. మరొకరు ఇటీవలే కెప్టెన్సీ బాధ్యతలను కోల్పోయిన రోహిత్ శర్మ. వీరిద్దరితో కలిసి గిల్ జట్టును నడిపించాల్సి ఉంది. ఈ క్రమంలో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సారథిగా గిల్ మెరుగ్గా మారడానికి ఇదొక చక్కటి వేదిక అని.. స్టార్ క్రికెటర్లు డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండటం తప్పకుండా కలిసొస్తుందని తెలిపాడు. ఆసీస్‌తో తొలి వన్డేకు ముందు నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అక్షర్ మాట్లాడాడు. "ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లా ఇప్పుడు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ శుభ్‌మన్ గిల్‌కు సారథిగా నిరూపించుకొనేందుకు మంచి అవకాశం. తప్పకుండా గొప్పగా మారుతుందని భావిస్తున్నా. కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకొనేటప్పుడు అతడు ఎప్పుడూ ఒత్తిడికి గురికాలేదు. గిల్‌లో ఉన్న మంచి లక్షణమదే. ఇతరుల సారథ్యంలోనూ నేను ఆడా. ఇప్పుడు యువ క్రికెటర్లు వచ్చారు. ఇది పరివర్తన కాలం. సీనియర్లు, జూనియర్లతో కలిసి మేం ఆడుతున్నాం. మా అనుభవాలను కుర్రాళ్లతో పంచుకుంటున్నాం. ఐపీఎల్‌లో ఆడిన అనుభవం వారికి కలిసి వస్తోంది" అని అక్షర్ వ్యాఖ్యానించాడు.

#### అప్పుడు ధోనీ.. ఇప్పుడు గిల్

"డ్రెస్సింగ్ రూమ్‌లో రోహిత్, విరాట్ కోహ్లి ఉండటం మాకు చాలా మేలు చేస్తుంది. మరీ ముఖ్యంగా కెప్టెన్‌గా గిల్ మరింత మెరుగవుతాడు. పరిస్థితులను ఎలా హ్యాండిల్ చేయాలో అవగాహన వస్తుంది. వారిద్దరి సూచనలు గిల్‌కు చాలా తోడ్పాటు అందిస్తాయి" అని అక్షర్ తెలిపాడు. ఎంఎస్ ధోనీ సారథిగా బాధ్యతలు చేపట్టినప్పుడు క్రికెట్ దిగ్గజాలు సచిన్ తెందూల్కర్, రాహుల్ ద్రవిడ్ జట్టులో ఉన్నారు. దాదాపు ఐదేళ్లపాటు ధోనీ నాయకత్వంలోనే ఆడారు. ఇప్పుడు గిల్ కూడా ఇద్దరు సీనియర్ క్రికెటర్లు టీమ్‌లో ఉన్నప్పుడే కెప్టెన్‌గా వచ్చాడు.



## 2027 వన్డే వరల్డ్ కప్‌లో రో-కో ఆడతారని భావిస్తున్నా : హెడ్

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌తో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి తిరిగి మైదానంలోకి అడుగుపెడుతున్నారు. దీంతో అందరి కళ్లూ వారిపైనే ఉన్నాయి. దాదాపు ఆరేడు నెలల తర్వాత వన్డే మ్యాచ్‌లు ఆడేందుకు స్టార్లు ఇద్దరూ సిద్ధమయ్యారు. ఆస్ట్రేలియాతో ఆదివారం మొదటి మ్యాచ్ జరగనుంది. భారత్ నుంచి అక్షర్ పటేల్.. ఆసీస్ తరఫున ట్రావిస్ హెడ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రో–కో వచ్చే వన్డే ప్రపంచ కప్‌లో ఆడతారని భావిస్తున్నట్లు హెడ్ వ్యాఖ్యానించాడు. దీనికి అక్షర్ పటేల్ సమాధానం ఇచ్చాడు. "రోహిత్, విరాట్ భారత్ కోసం అద్భుతాలు చేశారు. నా కంటే అక్షర్ పటేల్ బాగా చెప్పగలడు. ఇద్దరూ ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ ప్లేయర్లు. వారిని ఒకరితో మరొకరిని పోల్చడం సరికాదు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దూకుడుగా ఓపెనింగ్ చేసే రోహిత్ అంటే నాకు చాలా గౌరవం. అయితే, వారిద్దర్నీ ఏదొక స్టేజ్‌లో మిస్ అవుతామని తెలుసు. కానీ, 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఆడేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉన్నారు. తప్పకుండా ఆడతారని భావిస్తున్నా. దాని వల్ల ఆట మరింత గొప్పగా మారుతుంది" అని హెడ్ తెలిపాడు.

#### తప్పకుండా ఆడతారు: అక్షర్

"రోహిత్, విరాట్ ప్రపంచ స్థాయి అత్యుత్తమ ప్లేయర్లు. ఏం చేయాలో వారికి బాగా తెలుసు. తప్పకుండా సిద్ధంగా ఉంటారు. ఒకవేళ వారి ఫామ్ గురించి మాట్లాడాలనుకుంటే.. అందుకు వారూ రెడీ. ఇప్పటికే ఫిట్‌నెస్ టెస్టులోనూ పాస్ అయిపోయారు. ఫామ్‌లోకి రావడం వారికేమీ కొత్త కాదు" అని అక్షర్ వ్యాఖ్యానించాడు.

# రోహిత్ బరువు, ఫిట్‌నెస్‌పై పెద్ద చర్చే జరిగింది

### అప్పటి ఫొటోలు వైరల్ కావడంతోనే రోహిత్ ఇలా..: అభిషేక్ నాయర్

ఆస్ట్రేలియా పర్యటనకు వచ్చిన రోహిత్ శర్మ కొన్నిరోజుల కిందట సియట్ అవార్డుల కార్యక్రమంలో తళుక్కున మెరిశాడు. ఒక్కసారిగా అతడి శరీరాకృతిపై పెద్దఎత్తున చర్చ జరిగింది. ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో కాస్త బొద్దుగా ఉన్న రోహిత్.. ఇప్పుడు మాత్రం స్లిమ్ అయిపోయాడు. దీనివెనక భారత మాజీ క్రికెటర్, అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరించిన అభిషేక్ నాయర్ కీలక పాత్ర పోషించాడు. దాదాపు ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి రోహిత్ మళ్లీ అడుగుపెట్టబోతున్నాడు. గతంలో రోహిత్ ఎయిర్‌పోర్ట్‌లో ఉన్న ఫొటోలు వైరల్‌గా మారిపోయాయి. ఆ తర్వాత చాలా మార్పులు జరిగాయని, పునరాగమనం కోసం రోహిత్ తీవ్రంగా కష్టపడినట్లు అభిషేక్ వెల్లడించాడు. "రోహిత్ బరువు, ఫిట్‌నెస్‌పై పెద్ద చర్చే జరిగింది. చాలామంది కామెంట్లు చేశారు. ఎప్పుడైతే ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వస్తూ కనిపించిన రోహిత్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయో.. ఆ తర్వాత చాలా అంశాలు మారిపోయాయి. ఆ ఫొటోలతో రోహిత్ చాలా మోటివేట్ అయ్యాడు. వేగంగా, ఆరోగ్యంగా ఫిట్‌నెస్ సాధించవచ్చనే దానిపై ఎన్నో మార్గాలు అన్వేషించాం. అప్పటికి ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఇంకా 12 వారాలు మాత్రమే సమయం ఉంది. దీనిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని భావించాం. అందుకోసం భిన్నంగా చేయాలనే ఆలోచన వచ్చింది. ఈ సమయంలో కేవలం శరీరాకృతి నిర్వహణ పైనే కాకుండా.. బరువు పెరుగుదల పైనా దృష్టిపెట్టాం. శారీరకంగా మార్పులు జరుగుతూనే ఉంటాయి. అద్దంలో చూసుకుంటే ఎలా కనిపిస్తున్నాడు? ఫిట్‌గా ఉన్నాడని అనిపిస్తుందా? లేదా? అనేది కీలకమే. ఇదంతా చాలా వేగంగా జరగాల్సిన ప్రక్రియ.



మైదానంలో బ్యాటింగ్ చేసేటప్పుడు, ఫీల్డింగ్ సమయంలోనూ సౌకర్యంగా ఉండాలి. అందుకోసం ఈ 12 వారాలు చాలా కష్టపడ్డాడు. ఎన్నింటినో త్యాగం చేశాడు. అలా ఇప్పుడు ఉన్నట్లు నాజూగ్గా మారడం వెనక వెలకట్టలేని శ్రమ దాగి ఉంది" అని అభిషేక్ నాయర్ వ్యాఖ్యానించాడు.

#### కెప్టెన్సీ లేకపోవడంపై..

కేవలం వన్డేల్లో ఆడుతోన్న రోహిత్ శర్మను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. అతడి స్థానంలో శుభ్‌మన్ గిల్‌కే జట్టు పగ్గాలను బీసీసీఐ సెలక్షన్ కమిటీ అప్పగించింది. ఇప్పుడు ఆసీస్ పర్యటనకు కేవలం బ్యాటర్‌గానే రోహిత్ వచ్చాడు. " సారథి అయినా, కాకపోయినా సరే రోహిత్ ఆడే తీరు మాత్రం మారదు. జట్టుతోపాటు సహచరుల కోసం ఆడతాడు" అని నాయర్ వెల్లడించాడు.

### 1 బిలియన్ ఐపీఓకు హిందుస్థాన్

## కోకాకోలా బేవరేజెస్

ప్రముఖ శీతలపానీయాల సంస్థ కోకాకోలా.. భారత్‌కు చెందిన తన బాటిలింగ్ యూనిట్ హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను పబ్లిక్ ఇష్యూకు తీసుకురావాలని భావిస్తోంది. మార్కెట్ నుంచి 1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 8వేల కోట్లు) సమీకరించాలని అనుకుంటోంది. ఇందుకోసం ఇటీవల ఆ సంస్థ బ్యాంకర్లతో భేటీ అయినట్లు బ్లూమ్‌బెర్గ్ వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది. పబ్లిక్ ఇష్యూకు సంబంధించిన చర్చలు ఇంకా ప్రాథమిక దశలో ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. బ్యాంకర్ల నియామకం ఇంకా పూర్తి కాలేదని తెలిపాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది ఈ పబ్లిక్ ఇష్యూ పట్టాలెక్క అవకాశం ఉందని సమాచారం. ఐపీఓ సైజ్, ఇతర వివరాలపై త్వరలో స్పష్టత రానుంది. దీనిపై కోకాకోలా అధికారికంగా స్పందించలేదు. ఇటీవల కాలంలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ భారత అనుబంధ సంస్థలను ఐపీఓకు తీసుకొస్తున్నాయి. ఎల్‌జీ, హ్యుందాయ్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. కోకాకోలా కూడా ఈ జాబితాలో చేరనుంది. కోకాకోలాకు భారత్ అతిపెద్ద మార్కెట్. ప్రస్తుతం హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ లిమిటెడ్ విలువ 10 బిలియన్ డాలర్లుగా ఉంది. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థలో 5,200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 20 లక్షలమంది రిటైలర్లు ఉన్నారు. ప్రస్తుతం అంబానీకి చెందిన కాంపా కోలా నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది.

## పోస్టల్‌లో నెక్స్ట్ డే డెలివరీ..

### వచ్చే ఏడాది శ్రీకారం

దిల్లీ: మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలా శాఖ కూడా మారుతోంది. ప్రైవేటు సంస్థలతో పోటీపడేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. ఇటీవల రిజిస్టర్ పోస్ట్ విధానానికి స్వస్తి పలికి స్పీడ్ పోస్ట్‌కు మారిన తపాలా శాఖ.. ఇప్పుడు ఇ–కామర్స్ తరహాలో నెక్స్ట్‌డే డెలివరీ సేవలనూ అందించడానికి సిద్ధమవుతోంది. వచ్చే ఏడాది జనవరి నుంచి ఈ సేవలను ప్రారంభించనున్నట్లు కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. తపాలా ద్వారా ఏదైనా ఉత్తరం లేదా పార్శిల్‌ను స్పీడ్ పోస్ట్ చేస్తే 3–5 రోజులు పడుతోంది. ఇకపై 24 గంటలు, 48 గంటల్లోగా ఉత్తరాలను, పార్సిళ్లను గ్యారెంటీ డెలివరీ సేవలకు శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే ఏడాది జనవరి నుంచి దేశవ్యాప్తంగా ఈ సేవలను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. 2029 నాటికి తపాలా శాఖను లాభదాయకతలోకి తీసుకురావడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మొత్తంగా వచ్చే ఏడాది 8 రకాల కొత్త సేవలకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే డోర్‌స్టెప్ కేవైసీ, ప్రభుత్వ పథకాలు, ఆధార్ వంటి సేవలను తపాలా శాఖ అందిస్తోందని మంత్రి గుర్తు చేశారు.



## హైదరాబాద్‌లో రూ.1.35లక్షలు దాటిన పసిడి ధర

**హైదరాబాద్:** దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో రూ. 1.35 లక్షలు దాటి పరుగులు పెడుతోంది. శుక్రవారం 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ. 1,35,250కి చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల ధర రూ. 1,21,725కి చేరుకుంది. కిలో వెండి ధర రూ. 1,81,000కి చేరింది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్–చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. మరోవైపు, ధనత్రయోదశి నాడు ప్రజలు బంగారం, వెండి, విలువైన ఇతర పాత్రలను కొనుగోలు చేస్తారు. ఇది సంపద, అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. ఆ సెంటిమెంట్ కూడా బంగారం ధర పెరుగుదలకు కారణమవుతోంది. దాంతోపాటు పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చే ఏడాది ఆరంభం నాటికి బంగారం ధర రూ. 1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# భారత్ - పాక్ మ్యాచ్‌కు రికార్డు వ్యూయర్‌షిప్

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో టీమ్ఇండియా రెండు మ్యాచుల్లో గెలిచి.. మరో రెండు మ్యాచుల్లో ఓడింది. ఆదివారం కఠినమైన ఇంగ్లాండ్‌తో తలపడేందుకు సిద్ధమవుతోంది. అయితే, ఇప్పటివరకు జరిగిన మ్యాచుల్లో భారత్ – పాకిస్థాన్ పోరు హైలైట్. ఆ మ్యాచ్‌ను రికార్డు స్థాయిలో అభిమానులు వీక్షించడం గమనార్హం. అంతకు ముందు ఆసియా కప్‌లో పురుషుల టీమ్‌లు మూడుసార్లు తలపడిన సంగతి తెలిసిందే. దీంతో మహిళల మధ్య మ్యాచ్ ఎలా సాగుతుందోనని ఫ్యాన్స్ ఆసక్తిగా చూసినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. తాజాగా వరల్డ్ కప్‌లోని కొన్ని మ్యాచుల వీక్షణలను ఐసీసీ, జియో హాట్‌స్టార్ విడుదల చేసింది. శ్రీలంకతో భారత్ పోరు నుంచి అభిమానులు ఎక్కువగా వరల్డ్ కప్ మ్యాచులు వీక్షించడం మొదలైంది. తొలి 13 మ్యాచులకు దాదాపు 60 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఇందులో భారత్ – పాక్, భారత్ – ఆస్ట్రేలియా మ్యాచ్‌కు సంబంధించిన గణాంకాలూ ఉన్నాయి. గత వన్డే ప్రపంచకప్ కంటే నిమిషాలపరంగా 12 రెట్లు అధికంగా మ్యాచ్‌లు చూశారు. ఈసారి 7 బిలియన్ల నిమిషాల వాచ్‌టైమ్ నమోదైంది. భారత్ – పాకిస్థాన్ మ్యాచ్‌ను దాదాపు 28.4 మిలియన్ల వ్యూయర్లు వీక్షించారు. నిమిషాలపరంగా 1.87 బిలియన్ మినిట్స్ నమోదు కావడం గమనార్హం. మహిళల క్రికెట్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఆ తర్వాత భారత్ – ఆస్ట్రేలియా మ్యాచ్‌ను ఫ్యాన్స్ ఆసక్తిగా చూశారు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓడినప్పటికీ పోరాటం మాత్రం బాగుంది. దీంతో 4.8 మిలియన్ల వ్యూయర్‌షిప్ వచ్చింది. లీగ్ స్టేజ్‌లో భారత్ ఇంకా మూడు మ్యాచులు ఆడనుంది. అందులో ఇంగ్లాండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌తో తలపడనుంది. సెమీస్‌కు చేరుకోవాలంటే భారత్‌కు ప్రతి మ్యాచ్ ఫలితం కీలకం. దీంతో వ్యూయర్‌షిప్‌పరంగా మరిన్ని రికార్డులు నమోదవుతాయని క్రికెట్ విశ్లేషకుల అంచనా.



MOVIE TIME CINEMA
www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక

# ఎల్లమ్మ సినిమా హీరోగా దేవిశ్రీప్రసాద్?

## కోడై కూస్తున్న సోషల్ మీడియా





బలగం వేణు నిర్మించనున్న ఎల్లమ్మ సినిమాకు అరుదైన హీరో దొరికాడు. బలగం వంటి సూపర్ సక్సెస్ తర్వాత వేణు ఎల్లమ్మ అనే మరో చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తోండగా ఎడాదిన్నరగా హీరో విషయంలో తర్జన భర్జనలు జరుగుతూ ఉన్నాయి. నాని, నితిన్, శర్వానంద్, నిఖిల్, బెల్లంకొండ శ్రీనివాస్ ఇలా నలుగురైదుగురు పేర్లు తెరమీదకు వచ్చి పోవడం జరిగిపోయాయి. ఇక కథానాయికల విషయంలోనూ సాయి పల్లవి, కీర్తి సురేశ్‌ల మధ్యే చర్చలు నడుస్తున్నట్లు వార్తలు ఎప్పటినుంచో ఉన్నాయి. అయితే.. తాజాగా ఈ స్థానంలోకి సంగీత దర్శకుడు దేవీ శ్రీ ప్రసాద్ పేరు రావడం సినీ లవర్స్‌ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇప్పుడు ఈ వార్త సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో హల్‌చల్ చేస్తోంది. అంతేగాక ఈ సినిమాకు దేవీనే సంగీతం కూడా అందించనున్నట్లు సమాచారం. ఇప్పటికే డ్యాన్స్, నటనలోనూ దేవీకి అద్భుత ప్రతిభ ఉంది. అయితే ఈ వార్తల విషయంలో ఇప్పటివరకు అధికారిక ప్రకటన అయితే లేదు. మేకర్స్ , దర్శకుడు వేను, దిల్ రాజు, దేవీ శ్రీ ప్రసాద్ స్వయంగా స్పందిస్తే తప్ప ఈ వార్తలపై క్లారిటీ రాదు. ఇదిలాఉంటే.. కుమారి 21ఎఫ్ సినిమా సమయంలో దేవి శ్రీ ప్రసాద్‌ని నా ఎస్వీసీ బ్యానర్ లో సుకుమార్ దర్శకత్వంలో హీరోగా పరిచయం చేస్తాను అని దిల్ రాజు గతంలోనే మాట ఇచ్చాడు. కానీ దశాబ్దం గడిచినా అది ముందుకు పడలేదు. ఇప్పుడు ఈ చిత్రంతో అటు వేణు, ఇటు డీఎస్పీ ఇద్దరిని కలిపి సినిమా తీస్తే దిల్ రాజు ఇచ్చిన మాట కూడా నేరవేరినట్లే అవుతుందని టాక్ వినిపిస్తోంది. అయితే ఎల్లమ్మ సినిమా విషయంలో ఎలాంటి వార్తలు వస్తాయో ఎదురు చూడాలి.



### ఫెయిల్యూర్స్‌కి నేనెప్పుడూ

# కుంగిపోను..

### పూజాహెగ్డే..

టాలీవుడ్ బుట్టబొమ్మగా గుర్తింపు తెచ్చుకున్న పూజాహెగ్డే.. వరుస సినిమాలు చేస్తున్నప్పటికీ అనుకున్న రేంజ్‌లో హిట్ తెచ్చుకోలేకపోతుంది. అయితే.. ఇటీవల మాత్రం కూలీ చిత్రంలో స్పెషల్ సాంగ్ 'మోనిక'తో కుర్రాళ్లను మెస్మరైజ్ చేసింది ఈ బ్యూటీ. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజా తన సినీ ప్రయాణంపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'కెరీర్ స్టార్టింగ్‌లోనే పరాజయాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొన్నాను. ఆ తర్వాత వరుస విజయాలతో స్టార్‌డమ్‌ను సంపాదించుకున్నా. అయితే.. ఒక్కోసారి మనం ఎన్ని ప్రయత్నాలు చేసినా విజయాలు దక్కవు. అలా అని ఫెయిల్యూర్స్‌కి నేనెప్పుడూ కుంగిపోను. ప్రస్తుతం చేస్తున్న సినిమాలపై గట్టి నమ్మకంతో ఉన్నాను. ఈసారి మాత్రం నా అంచనాలు తప్పవు. మళ్లీ తిరిగి పూర్వ వైభవాన్ని సాధిస్తానని నమ్మకం ఉంది' అని చెప్పింది. కాగా.. ప్రస్తుతం పూజా చేతిలో జననాయగన్, కాంచన -4 వంటి భారీ ప్రాజెక్ట్‌లున్నాయి.

# ఆకట్టుకోలేక పోయిన తెలుసు కదా..

**డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న సిద్ధు జొన్నలగడ్డను జాక్ సినిమా రిజల్ట్ నిరాశ పర్చింది. దాంతో కాస్తంత జాగ్రత్త పడుతూ తెలుసు కదా మూవీని చేశాడు. నీరజ కోనను దర్శకురాలిగా పరిచయం చేస్తూ, ఈ మూవీని టీజీ విశ్వప్రసాద్, ఆయన కూతురు కృతి నిర్మించారు. వరుణ్ (సిద్ధు జొన్నలగడ్డ) ఓ అనాథ. అతని స్నేహితుడు అభి (వైవా హర్ష). ఇద్దరూ చిన్నప్పటి నుంచి కలిసే పెరుగుతారు.**




మొదటి నుండి తనకంటూ ఓ సొంత కుటుంబం ఉండాలని కలలుకంటూ ఉంటాడు సిద్ధు. తన ప్రమేయం లేకుండానే జరిగిన ఓ బ్రేకప్ తర్వాత బుద్ధిగా అంజలి (రాశీఖన్నా)ని పెళ్లి చేసుకుంటాడు వరుణ్. పెళ్ళి అయిన కొన్ని నెలలకే అంజలికి పిల్లలు పుట్టరనే విషయం తెలుస్తుంది. దాంతో సరోగసీ ద్వారా పిల్లలను కనాలని అనుకుంటారు. అందుకోసం రాగ కుమార్ (శ్రీనిధి శెట్టి) అనే డాక్టర్ ముందు కొస్తుంది. వరుణ్, అంజలికి తాను సరోగసీ ద్వారా బిడ్డ కంటానని చెబుతుంది. అందుకు వరుణ్ అంగీకరించాడా? వరుణ్ కూ రాగాకు ముందే పరిచయం ఉందా? ఆ పరిచయాన్ని ఎందుకు వీళ్ళిద్దరూ అంజలి దగ్గర దాచి పెట్టారు? దాని పర్యవసానం ఏమిటీ? అనేది మిగతా కథ. ముక్కోణ ప్రేమకథా చిత్రాలకు కొదవలేదు. ప్రతి యేడాది ఎన్నో అలాంటి సినిమాలు వస్తూనే ఉంటాయి. ఇది అదే తరహా రోమ్ కామ్ మూవీ అయినా... ఇందులో విషయం కాస్తంత భిన్నమైంది. ముక్కోణ ప్రేమకథ కంటే కూడా పెళ్ళైన తర్వాత ఓ యువకుడి జీవితంలో జరిగిన విచిత్రమైన సంఘటనలను బేస్ చేసుకుని సాగే కథ ఇది. కొత్తగా పెళ్ళైన ఓ జంట మధ్యలోకి సరోగసీ మదర్ గా ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ వస్తే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయనే అంశంతో నీరజ కోన ఈ కథను రాసుకున్నారు. ఫస్ట్ హాఫ్ ఆసక్తికరంగా సాగినా... సెకండ్ హాఫ్ లో వరుణ్ నిజాన్ని బయటపెట్టిన తర్వాత మూవీ స్పీడ్ తగ్గిపోయింది. అక్కడ నుండి క్లయిమాక్స్ వరకూ లవ్ అండ్ హేట్ రిలేషన్ లోనే కథంతా సాగింది. ఈ మూడు పాత్రల్లో ఎవరికి వారు... తాము తీసుకున్న నిర్ణయం కరెక్ట్ అనే భావనలో ఉన్నా... థియేటర్లోని ప్రేక్షకుడు మాత్రం ఎవరి పక్షానా నిలబడే పరిస్థితి ఉండదు. నాలుగు పాత్రల చుట్టూనే సినిమా అంతా సాగడం బోర్ కొట్టిస్తుంది. ద్వితీయార్థంలో డ్రామాను పక్కన పెట్టేసి, డైలాగ్స్ మీద మూవీని నడిపే ప్రయత్నం చేసింది నీరజా కోన. తీవ్రమైన భావోద్వేగాలను పండించాల్సి చోట పై పై సన్నివేశాలతో సినిమా సాగిపోయింది. లైఫ్ లో చిల్ అవ్వాలనుకునే కేర్ ఫ్రీ గర్ల్ గా శ్రీనిధి శెట్టి బాగానే చేసింది. రాశీ ఖన్నా పాత్ర హుందాగానే సాగినా సెకండ్ హాఫ్ లోని ట్విస్ట్ అండ్ టర్న్ ను ఎక్స్ ప్రెస్ చేయడంలో లోటు కనిపించింది. హీరో స్నేహితుడిగా వైవా హర్ష బాగా చేశాడు. అతని పాత్రే సినిమాలో కొంత రిలీఫ్ ను ఇచ్చింది. మిగిలిన మూడు, నాలుగు పాత్రలు ఇలా వచ్చి అలా వెళ్ళిపోయేవే... ఏ పాత్రకూ ప్రాధాన్యం లేదు.

# సరదాగా సాగే కథతో కె ర్యాంప్

### హీరో కిరణ్ అబ్బవరం వెల్లడి



ఈ సినిమా చేయాలని అనుకున్నప్పుడే దీపావళికి విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ఖచ్చితంగా కుటుంబ సభ్యులందరూ కలసి చూసే చిత్రం అవుతుందని నమ్మాం. మేము అనుకున్న దానికంటే సినిమా బాగా వచ్చింది. నన్నూ, మా చిత్ర బృందాన్ని నమ్మండి. ఈ దీపావళి పండుగ కె.ర్యాంప్ తో మరింత సరదాగా ఉంటుంది. ఇకపై నా అభిమానులు గర్వపడేలా సినిమాలు చేస్తా అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ హీరోగా జైన్స్ నాని తెరకెక్కించిన చిత్రమిది. యుక్తి తరేజా కథానాయిక. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. ఈ నెల 18న విడుదలవుతోన్న సందర్భంగా గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా ఇంకా ఆయన మాట్లాడుతూ.. మాపై నమ్మకంతో రండి కడుపుబ్బా నవ్వించి తీరుతాం అని థియేటర్‌లో ఒక్కొక్కడికి బుర్రపాడు.. గుడ్డలు జారుడే అనేలా సినిమా ఉంటుందన్నారు. టికెట్ డబ్బులు వేస్ట్ అయ్యాయనే మాట రానివ్వమని అన్నారు. జైన్స్ నాని మాట్లాడుతూ సినిమా ÷లకైమాక్స్‌లో ఒక చిన్న ట్విస్ట్ ఉంటుంది. మంచి సందేశం కూడా ఉంటుంది. అన్ని వాణిజ్య హంగులతో తెరకెక్కించాం. కిరణ్ అబ్బవరం పాత్రచిత్రణ సరికొత్తగా ఉంటుంది. ఇంతకు ముందెన్నడూ చేయని పాత్రను ఈ చిత్రంలో పోషించారు. ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. సినిమా కూడా అదే స్థాయిలో ఉంటుంది అని చెప్పారు. రాజేశ్ దండా మాట్లాడుతూ ఈ సినిమాను 47 రోజుల్లో పూర్తి చేశాం. కేరళలో ఆహ్లాదకరమైన వాతావరణంలో చిత్రీకరణ చేశాం. సెట్‌లో ప్రతి రోజూ నవ్వుకున్నాం. సెట్‌లో నవ్వించిన ఏ సినిమా కూడా సక్సెస్ విషయంలో గురి తప్పలేదు. కె ర్యాంప్ కూడా మంచి విజయాన్ని అందుకుంటుంది అని ఆకాంక్షించారు. సీనియర్ నటుడు వీకే నరేశ్ మాట్లాడుతూ ఈ సినిమా చూసిన తర్వాత అందరూ మహేశ్ బాబు, అల్లు అర్జున్, నాని తర్వాత కిరణ్ పేరే చెబుతారు. చేతన్ భరద్వాజ్ మంచి సంగీతం అందించారు. భవిష్యత్తులో జైన్స్ నాని పెద్ద దర్శకుడు అవుతాడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు విజయ్ కనకమేడల, వీఐ ఆనంద్, రామ్ అబ్బరాజు, సుబ్బు, నటుడు సాయికుమార్, హీరోయిన్లు విమలా రామన్, కామ్నా జెఠ్మలానీ, సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ పాల్గొన్నారు.

# సామ్రాజ్యం ప్రోమో విడుదల చేసిన ఎన్టీఆర్

తమిళ అగ్ర హీరో శిలంబరసన్ టీఆర్ అలియాస్ శింబు హీరోగా జాతీయ అవార్డు దర్శకుడు, క్రియేటివ్ జీనియస్ వెట్రిమారన్ తెరకెక్కిస్తున్న చిత్రం అరసన్. తెలుగులో సామ్రాజ్యం పేరుతో రానుంది. తాజాగా ఈ చిత్రం ప్రోమోను యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఎక్స్ ద్వారా శుక్రవారం ఉదయం విడుదల చేశారు. ఇంకా షూటింగ్ పూర్తిగా పట్టాలెక్కని ఈ చిత్రం ఉత్తర చెన్నై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ కథతో రూపొందుతుండగా అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా విడుదల చేసిన ప్రోమో 4 నిమిషాలకు పైగా ఉండడమే గాక చూస్తే చాలా రా అండ్ రస్టిక్ లాగా ఉంది. హత్యా నేరం అభియోగంతో కోర్టుకు వచ్చిన హీరో జడ్జి ముందు నాకేమీ తెలియదు నన్ను ఇరికించారు అని చెబుతూనే మరో వైపు యంగ్ హీరో ముగ్గురిని నరికి చేతులు కడిగే సన్నివేశాలను ప్రజెంట్ చేశారు. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా బాగానే ఉంది. ప్రోమో ఆరంభఃలో జైలర్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఎంట్రీ అతనితో హీరో మాట్లాడే డైలాగ్స్ అదిరిపోయాయి. ముఖ్యంగా నా స్టోరీని ఎవరితో చేపిద్దామనుకుంటున్నారు.. ఎన్టీఆర్‌తో చేపించండి కుమ్మేస్తాడు అంటూ శింబ ఉచెప్పే డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. గతంలో వెట్రిమారన్, ధనుష్ కాంబోలో వచ్చిన వడ చెన్నై సినిమాను యూనివర్స్‌గా మార్చి అందులో ఓ పార్ట్‌గా ఈ సినిమాను తీసుకు వస్తున్నారు. ఇదిలాఉంటే ఈ చిత్రంలో సమంత, కీర్తి సురేశ్, సాయి పల్లవిలు ముగ్గురిలో ఇద్దరు కథానాయికలుగా చేయనున్నట్లు తెలుస్తోంది.



# 650 కోట్ల వసూళ్లను దాటేసిన కాంతారా

కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన కాంతార చాప్టర్ 1 చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఇప్పటికే ఇప్పటికే రూ.650 కోట్లను అలవోకగా దాటి బాహుబలి ది బిగినింగ్ రికార్డును బద్దలుకొట్టిన ఈ చిత్రం తాజాగా గదర్ 2 రికార్డును అధిగమించింది. గదర్ 2 చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.700 కోట్ల వసూళ్లను సాధించగా.. ఈ రికార్డును చెరిపివేస్తూ.. కాంతార రూ.717 కోట్లతో దూసుకుపోతుంది. దీంతో దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన టాప్20 చిత్రాల్లో కాంతార 16వ స్థానానికి ఎగబాకింది. 2025లో అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాల్లో రెండో ప్లేస్ దక్కించుకుంది. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ కథానాయికగా నటించగా గుల్షన్ దేవయ్య, జయరాజ్ కీలక పాత్రల్లో నటించారు.



Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com